శుక్రవారం
06-01-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 195
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

8 నుంచి గీతా ముఖర్జీ శతజయంత్యుత్సవం

కమ్యూనిస్టు విప్లవయోధ గీతా ముఖర్జీ శతజయంత్యువాన్ని ఈనెల 8వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని పార్టీశ్రేణులకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనను సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా వెలువరించారు.

8లో

రాష్ట్రంలో తగ్గిన ఓట్లు

7.51 లక్షలు ఔట్

- పెరిగిన యువ ఓటర్లు
- అగ్రస్థానంలో కర్నూలు, అట్టడుగున అల్లూరి జిల్లా
- ఓటర్ల తుది జాబితా విడుదల

అమరావతి: రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య గణనీయంగా తగ్గింది. తాజా లెక్కల ప్రకారం గతంతో పోలిస్తే 7,51,411 ఓటర్లు తగ్గారు. దీంతో మొత్తం ఓటర్ల సంఖ్య 3.99 కోట్లకు పడిపోయింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ అనంతరం తుది జాబితాను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనా గురువారం విడుదల చేశారు. ప్రత్యేక సవరణ-2022 ముగిసేవరకు జనవరి 5, 2022 నాటికి రాష్ట్రంలో మొత్తం 4,07,36,279 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం మొత్తం ఓటర్ల సంఖ్య 3,99,84,868కు తగ్గింది. ఇందులో మహిళా ఓటర్లు 2,02,21,455, పురుషులు 1,97,59,489, ట్రాన్స్ జెండర్లు 3,924 మంది ఉన్నారు. కర్నూలు జిల్లా 19,42,233 మంది ఓటర్లతో అగ్రస్థానంలో ఉండగా, అల్లూరి సీతారామరాజు జిల్లా 7,29,085 మందితో అట్టడుగున నిలిచింది. కాగా గత ఏడాది నవంబర్‌లో ప్రచురించిన ముసాయిదా జాబితా ప్రకారం 18-19 ఏళ్ల విభాగంలో మొదటిసారిగా ఓటు హక్కు పొందిన వారి సంఖ్య కేవలం 78,438 ఉండగా, తుది జాబితాలో ఆ సంఖ్య 3,03,225కి పెరిగింది. 18-19 సంవత్సరాల వయస్సు గల యువ ఓటర్ల నమోదును పెంచడానికి తాము అనేక చర్యలు చేపట్టామని మీనా పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించడం, ప్రత్యేక సహాయ ఎన్నికల నమోదు అధికారిని నియమించిన ఫలితంగా వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని మీనా తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో 68,162 మంది సర్వీస్ ఓటర్లు కాగా,

- మిగతా 2 లో

సర్పంచ్‌ల ఉద్యమబాట

- 15వ ఆర్థిక సంఘం నిధులేవి?
- రూ.8,660 కోట్లు దారిమళ్లింపు
- 23న విజయవాడలో రౌండ్‌టేబుల్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వం మళ్లించడంపై సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరెంటు బిల్లులు చెల్లించుకోలేక, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయలేక సర్పంచ్‌లు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. పేరుకు సర్పంచ్‌లే అయినా ఎలాంటి అధికారం వారికి లేదు. ప్రధానంగా సీఎం జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్పంచ్‌ల పట్ల వివక్ష చూపుతోంది. గ్రామ వలంటీర్ల వ్యవస్థతో సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాల్లాగా మారారు.

సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యాలయాలకు ప్రాధాన్యత తగ్గిపోయింది. వారి సమస్యల్ని, గౌరవ వేతనంపైనా ఆలకించే వారు లేరు. దీంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి న్యాయపోరాటం చేసేందుకుగాను ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్‌లు ఉద్యమ కార్యాచరణకు సిద్ధమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ8,660 కోట్లను దారిమళ్లించడంపై సర్పంచ్‌ల సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆ మేరకు ప్రతిపక్ష పార్టీలను కలుపుకుని ఉద్యమానికి సన్నద్ధమయ్యాయి. ఈనెల 23న విజయవాడలో ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనుంది. ఇప్పటికే సీపీఐ, సీపీఎం తదితర పార్టీల నేతలకు ఆహ్వానాలు పంపింది. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైవీబీ రాజేంద్రప్రసాద్, బిర్రు ప్రతాపరెడ్డి, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల రమేశ్ తదితరులు ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల దారిమళ్లింపు, సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం కోసం అన్ని పార్టీల మద్దతుదారులైన సర్పంచ్‌లు సంక్షేమ సంఘంగా ఏర్పాటై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచనున్నారు.

సర్పంచ్‌ల డిమాండ్లు ఇవి

15వ ఆర్థిక సంఘం నిధులను పీఎంఎఫ్ఎస్ లింకేజీ ఉన్న కొత్త బ్యాంకు ఖాతాలోనే నేరుగా కేంద్రం ప్రతి పంచాయతీకి జమ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామ పంచాయతీ, సర్పంచ్‌ల ఆధీనంలోనే గ్రామ సచివాలయాల కార్యకలాపాలు జరగాలి. వలంటీర్లు, సిబ్బంది సైతం సర్పంచ్‌ల ఆధీనంలో ఉండాలి. గడప గడపకూ కార్యక్రమం కింద సమస్యల పరిష్కారానికి విడుదల చేస్తున్న రూ.20లక్షల నిధులను సర్పంచ్‌ల ఆధీనంలోనే జరిగేలా ఆదేశించాలి. సర్పంచ్‌ల గౌరవ వేతనం

- మిగతా 2 లో

అమ్మకానికి ఆడబిడ్డ!

విశాలాంధ్ర-డోన్: మద్యానికి బానిసైన ఓ తండ్రి డబ్బుల కోసం తన సొంత కూతురిని అమ్మకానికి పెట్టాడు. దీనిని గమనించిన ఇరుగుపొరుగు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీన్ రివర్స్ అయింది. ఈ ఘటన నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో వెలుగుచూసింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా అలంపూర్ తాలూకాకు చెందిన మంజుల, జానకిరాముడు దంపతులు కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బతుకు తెరువు నిమిత్తం కొన్ని నెలల క్రితం ఇక్కడకు వచ్చారు. డోన్ పట్టణంలోని అమ్మ హోటల్ దగ్గర అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. జానకి రాముడు మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. మద్యానికి డబ్బుల కోసం భార్యను వేధించేవాడు. రెండున్నర సంవత్సరాల తన కూతురు మాధవిని విక్రయించడానికి గురువారం రైల్వేస్టేషన్‌కు తీసుకెళుతుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి జానకిరాముడును అదుపులోకి తీసుకున్నారు. జానకిరాముడుకు సీఐ మల్లికార్జున, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసుల సూచన మేరకు జానకిరాముడు దంపతులు డోన్ వదిలి సొంతూరు వెళ్లారు.

క్యూబా విప్లవానికి 64ఏళ్లు

2లో

50వేల మందిని వెళ్లగొట్టలేరు

- 'హల్ద్వానీ' అక్రమ కట్టడాల కూల్చివేతపై సుప్రీంకోర్టు స్టే
- మానవతా కోణంలో ఆచరణసాధ్య పరిష్కారం అవశ్యమని సూచన
- ఉత్తరాఖండ్ ప్రభుత్వానికి, రైల్వేశాఖకు నోటీసులు జారీ
- ఫిబ్రవరి 7కు విచారణ వాయిదా

న్యూఢిల్లీ/హల్ద్వానీ/డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రైల్వే భూమిలో అక్రమ కట్టడాలను కూల్చివేయాలంటూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు గురువారం స్టే విధించింది. అక్రమ కట్టడాల తొలగింపుపై హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సమాధానం ఇవ్వాలని రైల్వే, రాష్ట్ర ప్రభుత్వానికి సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది. సుమారు 50వేల మందిని ఉన్నపళంగా తమ ఇళ్లు-వాకిళ్లు వదిలి పొమ్మనడం పద్ధతి కాదని, ఇది మానవతా సమస్య అని, ఇందుకు ఆచరణసాధ్య పరిష్కారాలు కనుగోవాలని జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ ఏఎస్ ఓకా ధర్మాసనం నొక్కిచెప్పింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 7కు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

'1947 తర్వాత కొంత మంది ఈ స్థలాన్ని వేలంలో దక్కించుకుని నివాసాలు ఏర్పర్చుకున్నారు. 60-70 ఏళ్ల నుంచి ఉంటున్న వారిని ఒక్కసారిగా వెళ్లిపోమని చెప్పడం సరైన పద్ధతి కాదు. ఇలాంటివాటిని మేం ప్రోత్సహించబోం. అక్కడి ప్రజలకు తప్పనిసరిగా పునరావాసం కల్పించాలి. భూమిపై ఏ హక్కూ లేకపోయినాగానీ పునరావాసం కల్పించిన తర్వాత స్థలాలు ఖాళీ చేయించిన సందర్భాలు ఉన్నాయి. ఈ సమస్యకు ఆచరణసాధ్య పరిష్కారం అవసరం. అసలు ఈ స్థలం మొత్తం రైల్వేదా లేక ప్రభుత్వానిది కూడానా? అన్నది ముందు తేలాలి. ఎలాంటి స్పష్టత లేకుండానే 50వేల మందిని నిరాశ్రయులు చేయలేం' అని సర్వోన్నత ధర్మాసనం పేర్కొంది. హైకోర్టు తీర్పుపై స్టే విధించింది. ఈ వ్యవహారంలో ఉత్తరాఖండ్ ప్రభుత్వం, రైల్వేశాఖ స్పందన కోరుతూ నోటీసులను జారీచేస్తూ తదుపరి విచారణను ఫిబ్రవరి

- మిగతా 2 లో

అమెజాన్ ఉద్యోగాల్లో భారీ కోత

- నవంబరులో ప్రకటించిన వారు కూడా ఇదే జాబితాలో
- ఇదే బాటలో సేల్స్‌ఫోర్స్

వాషింగ్టన్: కొత్త సంవత్సరంలోనూ ఉద్యోగాల కోత కొనసాగుతోంది. తాజాగా 18,000 మంది ఉద్యోగుల్ని తొలగించనున్నట్లు ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన ప్రకటించింది. అస్థిర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలోనే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వస్తోందని వివరించింది. ఈ మేరకు కంపెనీ సీఈఓ ఆండీ జస్సీ ఉద్యోగులకు ఓ లేఖ రాశారు. నవంబరులోనే ఉద్యోగాల కోతపై అమెజాన్ ప్రకటన చేసింది. అప్పుడే కొంతమందికి ఉద్వాసన పలికింది. ఈ తొలగింపు ప్రక్రియ కొన్ని నెలల పాటు కొనసాగుతుందని పేర్కొంది. అన్ని విభాగాల్లో లోతైన సమీక్ష జరిపి పునర్వ్యవస్థీకరణ అవసరమైన

- మిగతా 2 లో

ఏపీపై కేసీఆర్ కన్ను!

ఆంధ్రా ప్రాంతానికి చెందిన రాజకీయ నిరుద్యోగులు, ద్వితీయ శ్రేణి నాయకత్వంపై బీఆర్ఎస్ కన్నువేసింది.రాబోయే రోజుల్లో హైదరాబాద్‌లో ఆస్తులు కలిగిన మరికొందరు ఆంధ్ర ప్రాంత నేతలు చేరే అవకాశాలు కన్పిస్తున్నాయి. విజయవాడ కేంద్రంగా కేసీఆర్ సభ నిర్వహణకూ ఏర్పాట్లు చేస్తున్నారు.

- బీఆర్ఎస్‌లో జనసేన నేతలు
- ఓ వైపు బెదిరింపులు... మరోవైపు తాయిలాలు
- రాజకీయ నిరుద్యోగుల ఆసక్తి
- హైదరాబాద్‌లో ఆస్తుల రక్షణకు ఆరాటం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించడానికి మార్గం సుగమమైంది. ఏపీకి చెందిన కొంతమంది నాయకులు బీఆర్ఎస్‌లో చేరడానికి ఆసక్తి చూపడంతో ఆ పార్టీ అధినేత కె.చంద్రశేఖరరావు చకచకా అడుగులు వేస్తున్నారు. హైదరాబాద్‌లో పెద్దఎత్తున ఉన్న ఆస్తులు పరిరక్షించుకోవడానికి నాయకులు అటువైపు అడుగులు వేస్తుండగా...మరికొంతమందిని నయానా భయానా పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. తాజాగా జనసేన మాజీ నేతలు మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు, తోట చంద్రశేఖర్, కాపుసంఘాల నేతలు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోవడం చర్చనీయాంశమైంది. రావెల కిశోర్‌బాబు మినహా మిగిలిన వారంతా కాపు సామాజిక వర్గ నేతలు బీఆర్ఎస్‌లో చేరడం విశేషం. కాపు నేతలు బీఆర్ఎస్ వైపు చూడటం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఏపీలో నష్టం వాటిల్లే ప్రమాదం ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అంతేకాకుండా కేసీఆర్ ఏపీలో కాపు నేతలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. జనసేన పార్టీకి చెక్ పెట్టేందుకే ఏపీలోకి బీఆర్ఎస్ అడుగుపెడుతున్నట్లు బీజేపీ నేత కన్నా లక్ష్మీనారాయణ సంచలన వ్యాఖ్యలు చేయడం ఇందుకు బలం చేకూరుస్తోంది. తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు కల్వకుర్తి చంద్రశేఖరరావు(కేసీఆర్), వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కనుసన్నల్లోనే ఇదంతా కొనసాగుతుందనే ప్రచారరం ఊపందుకుంది. పవన్ కల్యాణ్ ఆలోచనా విధానం, జెండా, అజెండా ఏమిటో తెలియకపోవడం ఆ పార్టీ నాయకులను పట్టిపీడిస్తోంది. జనసేనను అధికారంలోకి తీసుకొచ్చే దిశగా ఒక్క కార్యాచరణ కనిపించకపోవడం కాపు నేతలకు సైతం విసుగుతెప్పిస్తోంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వబోనని ఒకసారి...బీజేపీ రోడ్‌మ్యాప్ కోసం ఎదురుచూస్తున్నట్లు మరోసారి...టీడీపీతో పొత్తు సంకేతాలు ఇంకోసారి ఇస్తూ తన అభిమానులు, కార్యకర్తలను పవన్ గందరగోళంలోకి నెడుతున్నారు. దీంతో ఏమిచేయాలో అర్థంకాక ఇప్పటికే కొద్దిమంది జనసేన నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఆంధ్రాలో బీఆర్ఎస్ ప్రవేశంపై వైసీపీ, బీజేపీ ప్రతికూలంగా స్పందించగా...టీడీపీ, జనసేన ఇంకా నోరు మెదపలేదు. సాధారణంగా కొత్త

- మిగతా 2 లో

ఇదీ లోకం!



ఆర్టీసీలోనూ యూటీఎస్

- ప్రత్యేక యాప్‌తో టికెటింగ్
- నగదు రహిత లావాదేవీలకు శ్రీకారం
- దేశంలోనే తొలిసారి
- అధ్యయనం కోసం 8 రాష్ట్రాల బృందం రాక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) నూతన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నగదు రహిత లావాదేవీల ప్రోత్సాహం కోసం యూనిఫైడ్ టికెటింగ్ సొల్యూషన్ (యూటీఎస్) ప్రవేశపెట్టింది. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు నేతృత్వంలో ప్రయాణికుల సౌకర్యార్థం యూటీఎస్ విధానాన్ని తెరపైకి తీసుకొచ్చారు. ఇందుకోసం ఆర్టీసీ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఇది దేశంలోని ఆర్టీసీ సంస్థలకు ఆదర్శంగా నిలుస్తోంది. యూటీఎస్ విధానంలో ప్రయాణికుల సౌలభ్యం కోసం ఒకే యాప్‌లో ముందస్తు టికెట్ బుక్ చేసుకునేందుకు, బస్సుల ట్రాకింగ్ లభ్యత వివరాలను తెలుసుకునేందుకు, కార్గో/పార్శిల్ బుకింగ్ తదితర సేవలకు దోహదపడుతుంది. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ముందస్తుగా బస్ టికెట్లు కొనుగోలు చేసుకోవచ్చు. బస్సులోని

- మిగతా 2 లో

హెచ్-1బీ ఫీజు 780 డాలర్లు

భారీగా పెరిగిన అమెరికా వీసాల ఇమిగ్రేషన్ రుసుము

వాషింగ్టన్: అమెరికాలోని బైడెన్ ప్రభుత్వం వీసాల ఇమిగ్రేషన్ రుసుమును భారీగా పెంచేసింది. హెచ్-1బీతో పాటు వీసాల ఇమిగ్రేషన్ ఫీజును భారీగా పెంచేస్తూ అమెరికా పౌరసత్వం-వలస సేవలు (యూఎస్‌సీఐఎస్) ఒక ప్రకటన

- మిగతా 2 లో

క్యూబా విప్లవానికి 64ఏళ్లు

గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ విప్లవాభినందనలు

ఏథెన్స్: క్యూబా విప్లవానికి 64ఏళ్లు అయిన సందర్భంగా ఆ దేశానికి, అక్కడి ప్రజలకు గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) విప్లవాభినందనలు తెలిపింది. ఈ మేరకు ఓ లేఖను పంపింది. 1959, జనవరి 1న క్యూబా విప్లవం విజయోత్సవం జరిగింది. క్యూబా విప్లవం ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొంది. అమెరికాపై జరిగిన మొట్టమొదటి సోషలిస్టు విప్లవంగా 20వ శతాబ్దంలో కీలక ఘటనగా నిలిచింది. మార్క్సిజం-లెనినిజం-శ్రామికవర్గ అంతర్జాతీయవాదానికి జీవశక్తిగా ఆవిర్భవించింది. ఫిడెల్ కాస్ట్రో, చే గువేరా, కమిలో సియన్ఫులగోస్, రౌల్ కాస్ట్రో, విల్మా ఎస్పిన్, ఫ్రాంక్ పైస్ తదితర విప్లవ నేతల ఆవిర్భావానికి దోహదమైంది. శ్రామిక వర్గం కోసం చేపట్టిన విప్లవాల్లో వీరిది కీలకపాత్ర. సామ్రాజ్యవాదాన్ని శ్రామికశక్తి తిప్పికొట్టి సామాజిక హక్కులకు పునాది వేయగలిగింది. అంతర్జాతీయవాదం ఆధారంగా ఇతరుల విమోచన ఉద్యమాలకూ నిస్వార్థ సేవలు అందించడగమే కాకుండా త్యాగానికి వెనుకాడలేదు. నేడు బైడెన్ ప్రభుత్వం క్యూబాపై కఠిన ఆంక్షలు అమలు చేస్తోంది. క్యూబా ప్రభుత్వాన్ని గద్దెదించడమే కాకుండా క్యూబన్లు సాధించుకున్నవన్నీ నాశనం చేయాలని చూస్తోంది. క్యూబాను అన్ని విధాలా అణచివేసేందుకు నిరంకుశంగా వ్యవహరిస్తోంది. కాబట్టి క్యూబా విప్లవానికి అంతర్జాతీయ మద్దతును మరింత బలోపేతం చేసుకోవడం అవసరం. హరికేన్ ఇయాన్ వల్ల క్యూబా విద్యుత్ మౌలికవసతులు దెబ్బతిన్నాయి. ఇళ్లు ధ్వంసమయ్యాయి. పంటనష్టం సంభవించింది. వీటన్నింటి నుంచి కోలుకోవాలంటే అంతర్జాతీయ సహకారం క్యూబాకు అవశ్యం. ఆ దిశగా కృషి తక్షణావశ్యం. ఇందుకు కేకేఈ కట్టుబడి ఉంది. క్యూబాపై వినాశకర ఆంక్షల సడలింపునకు డిమాండ్ చేస్తోంది. అవి తాత్కాలికంగానైనా సరే అందుకు మద్దతిస్తుంది. క్యూబాపై అమెరికా దౌర్జన్యాన్ని కేకేఈ, కేఎన్ఈ తీవ్రంగా ఖండిస్తున్నాయి' అని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది.

కాల్పుల విరమణ ప్రకటించండి

ఏకపక్ష చర్యల కోసం పుతిన్‌పై ఎర్డోగన్ ఒత్తిడి

ఇస్తాంబుల్: ఉక్రెయిన్‌లో కాల్పుల విరమణను ఏకపక్షంగా ప్రకటించాలని టర్కీ అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్ గురువారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై ఒత్తిడి తెచ్చారు. ఇద్దరు అధినేతల మధ్య టెలిఫోన్ సంభాషణ జరిగినట్లు టర్కీ ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఉక్రెయిన్‌లో ఏకపక్ష కాల్పుల విరమణ-శాంతిచర్చలకు మద్దతు కోసం ఎర్డోగన్ పిలుపునిచ్చినట్లు వెల్లడించాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతోనూ ఎర్డోగన్ విడిగా మాట్లాడినట్లు సమాచారం. ఇటు మాస్కో అటు కీవ్‌తో ఉన్న సత్సంబంధాలను వాడుకొని రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం అంతానికి టర్కీ అధ్యక్షుడు మధ్యవర్తిత్వం వహిస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు శాంతి చర్చలను టర్కీ నిర్వహించింది. ఈ చర్చలు నల్లసముద్రం గుండా ఉక్రెయిన్ ఆహార ధాన్యాల సరఫరా కోసం ఐరాస మద్దతుతో ఒప్పందానికి దోహదమయ్యాయి. శాంతి సమావేశం కోసం జెలెన్స్కీ, పుతిన్‌ను టర్కీకి రప్పించే ప్రయత్నాన్నీ ఎర్డోగన్ చేశారు. మరోవైపు రష్యాపై పాశ్చాత్య దేశాల ఆంక్షలను పట్టించుకోకుండా ద్వైపాక్షిక వాణిజ్య బంధాన్ని టర్కీ కొనసాగించింది. ఇప్పుడు టర్కీని నేచురల్‌గ్యాస్ హబ్‌గా మార్చేందుకు రెండు దేశాలు కట్టుబడి ఉన్నాయి. తద్వారా యూరప్‌కు చమురు సరఫరా కోసం రష్యాకు ప్రత్యామ్నాయ మార్గం ఉంటుందని ఎర్డోన్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

పోప్ బెనెడిక్ట్ 16కు కన్నీటి వీడ్కోలు

వాటికన్‌లో అంత్యక్రియలు - పాల్గొన్న లక్ష మంది

వాటికన్ సిటీ: పోప్ బెనెడిక్ట్ 16కు వాటికన్ ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. పోప్ ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో బెనెడిక్ట్-16 అంత్యక్రియలు సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో గురువారం సంప్రదాయబద్ధంగా జరిగాయి. తమ అభిమాన పోప్ కడచూపు కోసం దాదాపు లక్షమందికిపైగా హాజరయ్యారు. కొన్ని దేశాల ప్రధానమంత్రులు, ముఖ్యులు పోప్ బెనెడిక్ట్‌కు నివాళులర్పించారు. పోప్ బెనెడిక్ట్ -16 జోసఫ్ రట్జింగర్ (95) డిసెంబరు 31న చనిపోయారు. ఆరు దశాబ్దాల కాలంలో పోప్‌గా రిటైర్మెంట్ ప్రకటించిన మొదటి వ్యక్తిగా ఈయన చరిత్రకెక్కారు. బెనెడిక్ట్ భౌతికకాయానికి మూడు రోజుల్లో 2లక్షల మంది నివాళులర్పించారు. అంత్యక్రియల్లో 60వేల మంది వస్తారని అంచనా వేయగా లక్ష మందికిపైగా హాజరైనట్లు ఇటలీ మీడియా పేర్కొంది. పోలీసు భద్రతా ప్రణాళికలు చివరి నిమిషంలో మారినట్లు వెల్లడించింది.

సాంకేతికత, అన్వేషణకు పెద్దపీట

మోదీతో సత్య నాదెళ్ల భేటీ

న్యూదిల్లీ: శాస్త్ర, సాంకేతిక రంగం అభివృద్ధికి భారత్ పెద్దపీట వేస్తోందని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. సాంకేతిక రంగాభివృద్ధి యుగంలో సాంకేతికత, అన్వేషణపై దృష్టి సారించామని చెప్పారు. 'సత్య నాదెళ్లతో సమావేశం కావడం ఆనందంగా ఉంది. సాంకేతికత, అన్వేషణకు భారత్ పెద్దపీట వేస్తోంది. కొత్త కొత్త ఆలోచనలతో మన యువత పురోగమిస్తోంది' అని మోదీ ట్వీట్ చేశారు. మైక్రోసాఫ్ట్ చైర్మన్ సత్య నాదెళ్ల గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తో సమావేశమయ్యారు. డిజిటలైజేషన్ ద్వారా జరుగుతున్న సుస్థిర, సమ్మిళిత ఆర్థికాభివృద్ధి గురించి చర్చించారు. ఈ వివరాలను సత్య నాదెళ్ల ట్విటర్ వేదికగా తెలిపారు. లోతైన అవగాహన కలిగేవిధంగా జరిగిన సమావేశం పట్ల సత్య నాదెళ్ల సంతృప్తి వ్యక్తం చేశారు. డిజిటల్ పరివర్తన ద్వారా సుస్థిర, సమ్మిళిత ఆర్థికవృద్ధిపై ప్రభుత్వం తీవ్రంగా దృష్టి సారించడం స్ఫూర్తిదాయకంగా ఉందని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా విజన్ సాకారమయ్యేందుకు సహక రించడానికి, ప్రపంచానికి దివిటీగా నిలిచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అంతకుముందు సత్య నాదెళ్ల మీడియాతో మాట్లాడుతూ భారత దేశ డిజిటల్ ఎకోసిస్టమ్‌ను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రశంసించారు. డిజిటల్ పబ్లిక్ గూడ్స్‌లో దేశం ముందంజలో ఉండటం చాలా గొప్పగా ఉందన్నారు. భారతదేశానికి ఓ ప్రత్యేకత ఉంటుందని చెప్పారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను దేశం వివేకవంతమైన, విజ్ఞానదాయకమైన విధానంలో నిర్మిస్తోందని ప్రశంసించారు. కృత్రిమ మేధాశక్తి గల వేదికల అభివృద్ధిలో భారత్ ప్రధాన పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు. చాట్ జీపీటీ, డాల్-ఈ వంటి విస్తృత లాంగ్వేజి మోడల్ - బేస్డ్ ఏఐ టెక్నాలజీలు భవిష్యత్తులో చాలా ముఖ్యమైనవి అవుతాయన్నారు. అదేసమయంలో వీటివల్ల ఉద్యోగుల తొలగింపు, బిజినెస్ మోడల్స్‌లో మార్పులు వంటివాటిని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. నాలుగు రోజుల భారత పర్యటనలో భాగంగా సత్య నాదెళ్ల బుధవారం విదేశాంగమంత్రి జైశంకర్‌తో సమావేశమయ్యారు. ఇద్దరు డిజిటల్ గవర్నెన్స్, భద్రత గురించి చర్చించారు.

నిరసనల్లో చిన్నారులా?

బాలల హక్కుల కమిషన్ ఆగ్రహం

న్యూదిల్లీ: ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో రైల్వే భూముల నుంచి ఆక్రమణల తొలగింపు ఉద్యమంలో చిన్నారులను భాగస్వాములను చేయడంపై బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించిన జాతీయ కమిషన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ఆందోళనలకు చిన్న పిల్లలను ఉపయోగించుకోవడంపై ఆగ్రహం వెలిబుచ్చింది. భారతీయ రైల్వేకు వ్యతిరేకంగా ఆందోళనలో భాగంగా చిన్నారులు రోడ్లపై బైఠాయింపు, ధర్నాలు చేసిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయని, దీనిపై సమాధానం చెప్పాలని నైనిటాల్ జిల్లా మేజిస్ట్రేట్‌కు బాలల హక్కుల కమిషన్ లేఖ రాసింది. హల్ద్వానీలో రైల్వే భూముల నుంచి ఆక్రమణలు తొలగించాలని ఉత్తరాఖండ్ హైకోర్టు డిసెంబరు 20న ఆదేశించింది. దీనికి అనుగుణంగా ఆ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాల కూల్చివేతకు రైల్వే అధికారులు సర్వే చేపట్టారు. ఇళ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా స్థానికులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. చిన్నారులు బ్యానర్లు చేపట్టి ఆందోళనల్లో నాల్గొన్న ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయని కమిషన్ తెలిపింది. ఇంతటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో చిన్నారులను ధర్నాలకు ఉపయోగించడం దారుణమని వ్యాఖ్యానించింది. దీనివల్ల చిన్నారుల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చింది. ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణ చేయాలని కలెక్టర్‌ను ఆదేశించింది.

ఖైదీల రెమిషన్ వివరాలివ్వండి

యూపీ డీజీ-జైళ్లకు సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూదిల్లీ: ఖైదీలను శిక్షకాలం ముగియకుండానే విడుదలచేసే 'రెమిషన్' పద్ధతిలో తీసుకునే చర్యల వివరాలు తెలపాలని సుప్రీంకోర్టు గురువారం యూపీ జైళ్ల డీజీని ఆదేశించింది. ఈ మేరకు అఫిడవిట్ సమర్పించాలని సూచించింది. ఉత్తరప్రదేశ్ రెమిషన్ విధానం ప్రకారం ముందస్తు విడుదల కోసం ఖైదీలు అర్జీలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, జైళ్ల అధికారులే ఈ కేసులను పరిగణనలోకి తీసుకుంటారని గతేడాది సెప్టెంబరు 6న సర్వోన్నత న్యాయస్థానం గుర్తించింది. 2018 విధానం అమలుకు అర్హతలు ఏమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోర్టు ప్రశ్నించింది. నాలుగు నెలల్లో 512 మంది యావజ్జీవ ఖైదీల విడుదల వ్యవహారం క్రమంలో ఎంతమంది ఖైదీలను ముందుగా విడుదల చేశారన్న వివరాలను జిల్లాలవారీగా ఇవ్వాలని, ఎంతమందిని పరిగణనలోకి తీసుకున్నారనేది తెలపాలని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహా ధర్మాసనం ఆదేశాలిచ్చింది.

విదేశీ వర్సిటీలకు పచ్చజెండా!

ముసాయిదా నిబంధనలు విడుదల చేసిన యూజీసీ

న్యూదిల్లీ: విదేశీ విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమమైంది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఈమేరకు ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. దీని ప్రకారం విదేశీ వర్సిటీలు... అడ్మిషన్ ప్రక్రియ, ఫీజు నిర్మాణాన్ని కూడా నిర్ణయించుకోవచ్చు. వాటి నిధులను మాతృసంస్థకు తిరిగి పంపవచ్చు. దేశంలో క్యాంపస్‌లను కలిగి ఉండే విదేశీ విశ్వవిద్యాలయాలు పూర్తి సమయంతో కూడిన ప్రోగ్రామ్‌లను ఆన్‌లైన్ లేదా దూరవిద్య ద్వారా కాకుండా ఆఫ్‌లైన్ విధానంలో మాత్రమే నిర్వహించాల్సి ఉంటుందని యూజీసీ చైర్‌పర్సన్ ఎం. జగదీష్ కుమార్ తెలిపారు. అలాగే విదేశీ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలు (హెచ్ఈఐలు) భారతదేశంలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి యూజీసీ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రాథమికంగా యూజీసీ అనుమతి 10 సంవత్సరాలు ఉంటుంది. కొన్ని షరతులకు లోబడి తొమ్మిదో సంవత్సరంలో అనుమతి కాలం పునరుద్ధరించబడుతుంది. విదేశీ విద్యా సంస్థలు భారతదేశ జాతీయ ప్రయోజనాలకు లేదా ఇక్కడి ఉన్నత ప్రమాణాలకు హాని కలిగించే ఎలాంటి అధ్యయన కార్యక్రమాన్ని అందించవని ఆయన స్పష్టం చేశారు.

ప్రస్తుతం యూజీసీ... భారతదేశంలో విదేశీ ఉన్నత విద్యా సంస్థల క్యాంపస్‌ల ఏర్పాటు, కోసం ముసాయిదా నిబంధనలను మాత్రమే ప్రకటించింది. దీనిపై సంబంధించిన వాటాదారుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాత నెలాఖరులో తుది నిబంధనల్ని ప్రకటిస్తారు. కుమార్ మాట్లాడుతూ... విదేశీ విశ్వవిద్యాలయాలు తమ అడ్మిషన్ ప్రమాణాలు, ఫీజు నిర్మాణాన్ని నిర్ణయించుకునే స్వేచ్ఛను కలిగి ఉన్నప్పటికీ ఫీజులను సహేతుకంగా, పారదర్శకంగా ఉంచాలని కమిషన్ సూచించినట్లు చెప్పారు.

కొత్త జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020, ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలు దేశంలో పనిచేయడాన్ని సులభతరం చేయాలని భావించింది. ఇందు కోసం తగు నిబంధనలు అమలు చేయబడతాయి. అటువంటి విశ్వవిద్యాలయాలకు దేశంలోని ఇతర స్వయంప్రతిపత్తి సంస్థలతో సమానంగా అధికారాలు ఇవ్వబడతాయని కుమార్ తెలిపారు. తద్వారా భారతీయ విద్యార్థులు సరసమైన ఖర్చుతో విదేశీ వర్సిటీల్లో అభ్యసించగలరన్నారు.

మండల కేంద్రం తరలిస్తే సహించేది లేదు

రాజకీయ కుట్రకు ప్రజలే తగిన సమాధానం చెబుతారు: సీపీఐ

విశాలాంధ్ర-వీరులపాడు: ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండల కేంద్రాన్ని తరలిస్తే సహించేది లేదని సీపీఐ నాయకులు స్పష్టం చేశారు. మండల కేంద్రం తరలింపు నిర్ణయానికి వ్యతిరేకంగా ఇక్కడి ప్రజలందరూ రాజకీయాలకు అతీతంగా మండల పోరాట కమిటీగా ఏర్పడి చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 21వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సీపీఐ ఎన్టీఆర్ జిల్లా పార్టీ తరపున జిల్లా డిప్యూటీ సెక్రటరీ దోనేపూడి శంకర్, అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొని పోరాటానికి సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా దోనేపూడి శంకర్ మాట్లాడుతూ గత 36 సంవత్సరాలుగా వీరులపాడు కేంద్రంగా ఎంతో అభివృద్ధి చెందిందని, ఈ అభివృద్ధిని కాలరాసి మండల కేంద్రాన్ని మారుస్తాము అంటే సహించేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పరుచూరి రాజేంద్రబాబు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా వీరులపాడు మండల కేంద్రంగా అన్ని హంగులతో ప్రభుత్వ కార్యాలయాలతో అభివృద్ధి చెందిందన్నారు. ఒకవేళ అభివృద్ధి జరగలేదు అంటే దానికి కారణం ప్రభుత్వాలే అని చెప్పారు. మండల మార్పు నిర్ణయంలో రాజకీయ కుట్ర, రాజకీయ కోణంని ప్రజలు గమనించాలని కోరారు. ప్రజా ప్రతినిధులు రాజకీయ కుట్రతో ఆలోచిస్తే దానిని ప్రజలు రాజకీయంగానే ఎదుర్కొనాలని హితవు పలికారు. మండల కేంద్రం తరలింపుకు వ్యతిరేకంగా కొనసాగుతున్న ఈ ప్రజా ఉద్యమానికి సీపీఐ జిల్లా సమితి తరపున సంపూర్ణ మద్దతును ప్రకటించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నందిగామ ఏరియా కార్యదర్శి చుండూరు సుబ్బారావు, ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు, సీపీఐ విజయవాడ నగర కార్యవర్గ సభ్యులు కొట్టు రమణ, వీరులపాడు మండల సీనియర్ నాయకులు వట్టికొండ చంద్రమోహన్, గుల్ మహమ్మద్, ఎంపీటీసీ మండూరు ప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు. 21వ రోజు రిలే నిరాహార దీక్షలో వీరులపాడు గ్రామానికి చెందిన గొల్లమూడి వెంకటేశ్వరరావు, వట్టికొండ రమేష్, తురక కోటేశ్వరరావు, నారుకొండ రమేష్, వట్టికొండ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీపై కేసీఆర్ కన్ను!

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ వస్తే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలుతుంది. ఏపీలో బీఆర్ఎస్ ప్రభావం పెద్దగా ఉండబోదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కేసీఆర్ అనగానే రాష్ట్ర విభజన, ఆంధ్రులపై ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రజలకు గుర్తుకొస్తాయని అంటున్నారు.

బీఆర్ఎస్‌పై వైసీపీ, బీజేపీ విమర్శలు

ఏపీకి కేసీఆర్ వెన్నుపోటు పొడిచారని, పులిచింతల, శ్రీశైలం, నాగార్జునసాగర్ దగ్గర దొంగ కరెంటు వేసుకుని తరలించుకుపోతున్నారని వైసీపీ ఎమ్మెల్యేలు పేర్ని వెంకట్రామయ్య(నాని), కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) గట్టిగా ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌తో రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదని అంటున్నారు. బీఆరెస్‌ను పట్టించుకోవాల్సిన అవసరం లేదని సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. ఏపీకి అన్యాయం చేసిన కేసీఆర్....ఇక్కడ ఎలా అడుగుపెడతారని బీజేపీ ఎంపీ జీవీఎల్ ప్రశ్నించారు. పోలవరానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం పిటిషన్లు వేయడాన్ని ఆయన గుర్తుచేశారు. ఇతర బీజేపీ నేతలు సైతం కేసీఆర్‌పైన, బీఆర్ఎస్‌పైన విమర్శలు ఆరంభించారు. ఆంధ్రా ప్రజలను దుర్భాషలాడిన కేసీఆర్...ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఏపీలో అడుగెడతారని ప్రశ్నించారు. సమైక్యాంధ్ర ఉద్యమకారులంతా ఒక్కొక్కరూ ముందుకొస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఏపీలో మనుగడ ఉండబోదనీ, నాటి రాష్ట్ర విభజనలో టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) నేతల దారుణాలు, దౌర్జన్యాలను గుర్తుచేస్తున్నారు. బీఆర్ఎస్‌కు ఆంధ్రాలో డిపాజిట్లు సైతం రావని, ఉనికి కోసమే ఆంధ్రులను బెదిరించి, పార్టీలో చేర్చుకుంటున్నారని ఆంధ్రా ఉద్యమకారులు మండిపడుతున్నారు.

రాజకీయ నిరుద్యోగులపైనే కన్ను

ఆంధ్రా ప్రాంతానికి చెందిన రాజకీయ నిరుద్యోగులు, ద్వితీయ శ్రేణి నాయకత్వంపై బీఆర్ఎస్ కన్నువేసింది. తెలంగాణలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాబోయే రోజుల్లో హైదరాబాద్‌లో ఆస్తులు కలిగిన మరికొందరు ఆంధ్ర ప్రాంత నేతలు చేరే అవకాశాలు కన్పిస్తున్నాయి. విజయవాడ కేంద్రంగా కేసీఆర్ సభ నిర్వహణకూ ఏర్పాట్లు చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రవేశం వల్ల తమకు ఎలాంటి నష్టం లేదన్నట్లు టీడీపీ, జనసేన మౌనం వహిస్తున్నాయి. జనసేన పూర్వపు నేతలు బీఆర్ఎస్‌లో చేరినప్పటికీ పవన్ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆంధ్రాపై కేసీఆర్ పూర్తిగా దృష్టి పెడతారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఆంధ్రాలో చిన్నా చితకా పార్టీలతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటుందా? లేక ఒంటరిగా పోటీ చేస్తుందా? అనే దానిపై ఆ పార్టీ నేతలకే స్పష్టత లేదు.

50వేల మందిని వెళ్లగొట్టలేరు

(మొదటిపేజీ తరువాయి)

7కు వాయిదా వేసింది. కాగా, హల్ద్వానీలోని బన్‌భూల్‌పురా ప్రాంతంలో ఉన్న 29ఎకరాల భూమి తమదని, అందులో అక్రమంగా 4,356 కట్టడాలు ఉన్నాయని రైల్వే గతేడాది ఉత్తరాఖండ్ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లింది. తమ స్థలాన్ని ఖాళీ చేయించాలని పిటిషన్‌లో కోరింది. ఈ కేసును విచారించిన హైకోర్టు... అక్రమ కట్టడాల కూల్చివేతకు ఆదేశాలిస్తూ గతేడాది డిసెంబరు 20న తీర్పు వెలువరించింది. అయితే ముందు నోటీసులు ఇవ్వాలని ఆపై వారానికి కూల్చివేతలు చేపట్టాలని ఆదేశాలు జారీచేసింది. జిల్లా మెజిస్ట్రేట్ వద్ద ఈ వ్యవహారం పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసి కూడా స్థానికల గురించి ఆలోచించకుండా హైకోర్టు ఉత్తర్వులు జారీచేసిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. 29 ఎకరాల్లో నాలుగు వేలకు పైగా కుటుంబాలు ఉన్నాయి. ప్రార్థనా మందిరాలు, స్కూళ్లు, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. 1970లో డ్రైనేజి లైన్లు ఏర్పాటు కాగా వాటర్ ట్యాంకు, స్కూళ్లు, కాలేజీలు, ఆసుపత్రులు, మసీదులు, ఆలయాలు ఉన్నాయని కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి కాజి నిజాముద్దీన్ తెలిపారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా ముస్లింలు ఉన్నట్లు చెప్పారు.

సుప్రీం తీర్పును స్వాగిస్తున్నాం: బన్‌భూల్‌పురా ప్రజలు

కూల్చివేతలపై సుప్రీంకోర్టు స్టే విధించడాన్ని బన్‌భూల్‌పురా ప్రజలు స్వాగతించారు. ఈ అంశాన్ని రాజకీయం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాటికి తాము వ్యతిరేకమన్నారు. 'సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించాం. మా వద్ద రుజువులు, పత్రాలు ఉన్నాయి.

మిగతా హల్ద్వానీలానే బన్‌భూల్‌పురా 'నజుల్' భూమి. మమ్మల్ని వెళ్లిపోమంటే మొత్తం హల్ద్వానీని ఖాళీ చేయించాల్సి ఉంటుంది. కేవలం మాపైనే వివక్ష ఎందుకు?' అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారు. వందేళ్లుగా ఈ ప్రాంతంలో స్థిరపడిన తన కుటుంబాన్ని ఉన్నపళంగా వెళ్లిపోమంటే ఎక్కడికి వెళ్లాలంటూ ఓ పెద్దాయన అడిగారు. తామున్న స్థలం తమదేనని రుజువు చేసుకునేందుకు అన్ని పత్రాలు ఉన్నాయని చెప్పారు.

ఆర్టీసీలోనూ యూటీఎస్

(మొదటిపేజీ తరువాయి)

ప్రయాణికులు సైతం నగదు ద్వారాతోపాటు యూపీఐ, డెబిట్‌కార్డు, క్రెడిట్ కార్డు, వాలెట్ల ద్వారా టికెట్ల కొనుగోలుకు యాజమాన్యం అవకాశం కల్పించింది. క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా టికెట్లను కొనుగోలుకు ఇది సులభతరమవుతుంది. ఇప్పటివరకు 8వేల బస్సుల్లో యూటీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానం ఇంతవరకు దేశంలో ఎక్కడా లేదు.

ఆర్టీసీని సందర్శించిన సీ-డీఏసీ అధికారుల బృందం

కేంద్ర ప్రభుత్వ సంస్థయిన సెంటర్ ఫర్ డవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ-డీఏసీ) అధికారుల బృందం గతేడాది డిసెంబరులో ఆర్టీసీ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించింది. ఐటీ విభాగంలోని వివిధ రకాల ప్రాజెక్టులను, వాటి పనితీరును పరిశీలించి ప్రశంసించింది. అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్ ఫోర్ట్ అండర్ టేకింగ్ (ఏఎస్ఆర్‌టీయూ) నేతృత్వంలో రెండు రోజులపాటు (శుక్ర, శనివారాల్లో) వివిధ రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ సంస్థల అధికారుల ప్రతినిధుల బృందం వచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న 87 రవాణా సంస్థలకుగాను, తొలిసారిగా 8 సంస్థల తరపున 21 మంది అధికారుల బృందం విచ్చేశారు. ఇక్కడి ఏపీఎస్ఆర్టీసీలో అమలవుతున్న యూటీఎస్, వివిధ రకాల ఐటీ ప్రాజెక్టులు, వాటి పనితీరు అధ్యయనాన్ని పరిశీలించారు. ఈ బృందానికి ఆర్టీసీ ఉన్నతాధికారులు, ఐటీ విభాగం ప్రతినిధులు స్వాగతం పలికారు. యూటీఎస్ విధానం సమర్థవంతంగా అమలు చేసిన ఐటీ విభాగం అధికారులు, సిబ్బందిని ఆయన ప్రశంసించింది. ఈ బృందానికి యూటీఎస్ విధానంపై ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు సమగ్రంగా వివరించారు. సంస్థల్లో అమలు చేస్తున్న ఐటీ ప్రాజెక్టులు, కార్గో, పార్శిల్ సర్వీసులు, ఎలక్ట్రికల్ బస్సులు తదతర వివరాలను వెల్లడించారు.

ఈ అధ్యయన బృందం 6న ఐటీ విభాగం అధికారులతో సమావేశమవుతుంది. అనంతరం ప్రధాన బస్టేషన్‌ను, ఒక బస్సు డిపోను, స్టోర్స్ విభాగం, గ్యారేజీని సందర్శిస్తుంది. ఈ కార్యక్రమానికి ఆర్టీసీలోని వివిధ విభాగాల అధికారులు ఎ.కోటేశ్వరరావు, పి.కృష్ణమోహన్, కేఎస్ బ్రహ్మానందరెడ్డి, ఎన్‌వీ రాఘవరెడ్డి, వి.సుధాకర్, వై.శ్రీనివాసరావు తదితర అధికారులు హాజరయ్యారు.

రాష్ట్రంలో తగ్గిన ఓట్లు

(మొదటిపేజీ తరువాయి)

6,891 మంది విదేశాల్లో ఉన్నారు. గత ఏడాది నవంబర్‌లో ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించిన తర్వాత కొత్తగా 5,97,701 మంది ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకున్నారు. కాగా 2022 జనవరి నుంచి నవంబరు మధ్యకాలంలో మొత్తం 4,66,973 మంది ఓటర్లు జాబితా నుంచి తొలగించబడ్డారు. ఓటర్లు-జనాభా నిష్పత్తి 721 కాగా, లింగ నిష్పత్తి 1,027గా ఉంది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950లోని సెక్షన్లు 22, 23 ప్రకారం నిరంతరం ఓటర్ల జాబితా నవీకరణ జరుగుతుందని మీనా వెల్లడించారు. అర్హత ఉన్న ఎవరైనా ఇప్పటివరకు ఓటు నమోదు చేసుకోలేకపోయినట్లయితే అతను లేదా ఆమె ఫారం-6లో దరఖాస్తు చేసుకోవచ్చునని మీనా స్పష్టం చేశారు.

అమెజాన్ ఉద్యోగాల్లో భారీ కోత

(మొదటిపేజీ తరువాయి)

చోట ఉద్యోగుల తొలగింపు ఉంటుందని వెల్లడించింది. నవంబరులోనే ప్రకటించినప్పటికీ.. కొంతమందిని ఇప్పటి వరకు తొలగించలేదు. వారిని కూడా తాజా 18,000 ఉద్యోగాల తొలగింపు ప్రక్రియలో చేర్చినట్లు జస్సీ తన ప్రకటనలో పేర్కొన్నారు. తమ నిర్ణయం వల్ల ప్రభావితమయ్యే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారనే విషయం తమకు తెలుసని జస్సీ అన్నారు. అయినప్పటికీ.. తప్పని పరిస్థితుల్లోనే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. కరోనా సంక్షోభ సమయంలో ఈ-కామర్స్ వ్యాపారం భారీగా పుంజుకున్న విషయం తెలిసిందే. గిరాకీకి అనుగుణంగా కంపెనీ పెద్దఎత్తున ఉద్యోగుల్ని నియమించుకుంది. ఇప్పుడు సాధారణ పరిస్థితులు నెలకొని వ్యాపారం నెమ్మదించడంతో వ్యయ నియంత్రణ చర్యలను చేపట్టింది. అందులో భాగంగానే ఉద్యోగులను తొలగించాల్సి వస్తోందని అమెజాన్ స్పష్టం చేసింది. ఉద్వాసనకు గురయ్యే వారికి తమ సహకారం ఉంటుందని జస్సీ తెలిపారు. ప్రత్యేక ప్యాకేజీలతో పాటు, ఆరోగ్య బీమా ప్రయోజనాలు, కొత్త ఉద్యోగాల వేటలో సాయం చేస్తామని ప్రకటించారు. ఐరోపాలోనూ తొలగింపులు తప్పవన్నారు. జనవరి 18న ఉద్యోగులకు సమాచారం అందిస్తామని పేర్కొన్నారు. వాస్తవానికి ఈ నిర్ణయాన్ని ఉద్యోగులకు తెలియజేసిన తర్వాత ప్రకటించాలనుకున్నామని తెలిపారు. కానీ, కంపెనీలో ఒకరు ఈ సమాచారాన్ని ముందే బయటకు వెల్లడించడంతో.. అధికారిక ప్రకటన చేస్తేనే బాగుంటుందని భావించామన్నారు. 2020 ప్రారంభం నుంచి 2022 ఆరంభం వరకు ప్రపంచవ్యాప్తంగా అమెజాన్ తమ సిబ్బందిని దాదాపు రెండింతలకు పెంచుకుంది. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకుంది. సెప్టెంబరు చివరి నాటికి కంపెనీలో ప్రపంచవ్యాప్తంగా 15.4 లక్షల మంది పనిచేస్తున్నారు. పండగలు, ఆఫర్ సీజన్‌లలో వచ్చే అనూహ్య గిరాకీకి అనుగుణంగా అమెజాన్ అదనంగా మరింత మందిని నియమించుకుంటుంది.

సేల్స్‌ఫోర్స్‌లో 8,000 మంది

బిజినెస్ సాఫ్ట్‌వేర్ సంస్థ సేల్స్‌ఫోర్స్ సైతం 8వేల మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. ఇది ఈ కంపెనీ మొత్తం సిబ్బందిలో 10 శాతానికి సమానం. కంపెనీ చరిత్రలో ఇదే అతిపెద్ద తొలగింపు ప్రక్రియ. ఉద్వాసనకు గురైన ఉద్యోగులకు ఐదు నెలల వేతనంతో పాటు ఆరోగ్య బీమా, కొత్త ఉపాధి ఏర్పాటుకు సహకారం అందిస్తామని కంపెనీ ప్రకటించింది. కరోనా సంక్షోభంలో వచ్చిన అనూహ్య గిరాకీ నేపథ్యంలో పెద్ద ఎత్తున ఉద్యోగుల్ని నియమించుకోవాల్సి వచ్చిందని సేల్స్‌ఫోర్స్ తెలిపింది. తాజా తొలగింపులకు తానే పూర్తి బాధ్యత వహిస్తున్నానని కంపెనీ సీఈఓ మార్క్ బెనియాఫ్ తెలిపారు. 2020 జనవరిలో సేల్స్‌ఫోర్స్ 49వేల మంది కొత్త వారిని నియమించుకుంది. కరోనా ముందుతో పోలిస్తే ఇప్పటికీ ఉద్యోగుల సంఖ్య 50 శాతం అదనంగా ఉందని కంపెనీ వర్గాలు తెలిపాయి.

సర్పంచ్‌ల ఉద్యమబాట

(మొదటిపేజీ తరువాయి)

రూ.3వేల నుంచి రూ.15వేలకు పెంచాలి. గ్రామ పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడార్ వేతనాలను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. సచివాలయాలపై వచ్చే ఆదాయాన్ని గ్రామ పంచాయతీ ఖాతాలోనే వేయాలి. సర్పంచ్‌లు విధి నిర్వహణలో మరణిస్తే రూ.20లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పించాలి. ఈ సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం కార్యాచరణకు సిద్ధమైంది. ఇప్పటికైనా సీఎం జగన్ స్పందించి సర్పంచ్‌ల సమస్యల్ని పరిష్కరించాలని, ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల అభివృద్ధికి వినియోగించాల్సిన అవసరముంది.

హెచ్-1బీ ఫీజు 780 డాలర్లు

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. హెచ్-1బీపై వీసా రుసుము 460 డాలర్ల నుంచి 780 డాలర్లకు పెరుగగా ఎల్-1 ఫీజు ఏకంగా 1,385 డాలర్లకు పెరిగింది. ఇప్పటివరకు 460 డాలర్లుగానే ఉంది. అలాగే ఓ-1 వీసాల దరఖాస్తు రుసుమును 460 డాలర్ల నుంచి 1,055 డాలర్లకు పెరిగేలా ప్రతిపాదన ఉన్నది. హెచ్-1బీ నాన్-ఇమిగ్రెంట్ వీసా. వివిధ క్షేత్రాల్లో నైపుణ్యం ఉన్న విదేశీ వర్కర్లకు అమెరికా కంపెనీల్లో ఉద్యోగాలకు ఇది అవసరం. ముఖ్యంగా టెక్నాలజీ కంపెనీలు దీనిపై ఆధారపడతాయి. భారత్, చైనా వంటి దేశాల నుంచి లక్షల ఉద్యోగులు హెచ్-1బీ వీసా పొందడం ద్వారా అమెరికా కంపెనీల్లో పనిచేయగలుగుతున్నారు. హెచ్2బీ పిటిషన్లు (సీజనల్- వ్యవసాయేతర వర్కర్లు) ఫీజు 460 డాలర్ల నుంచి 1,080 డాలర్లకు పెరిగింది. అయితే ఉద్యోగాలు కల్పించే సమయంలో యజమానులు ఫారం ఐ-129, ఫారం ఐ-140ను 'అసైలం ప్రోగ్రామ్ ఫీ' కింద 600డాలర్లు చెల్లించాల్సి ఉండటంతో వీసా వ్యయం మరింత పెరుగుతుంది. ఫారం ఐ-129 అన్నది నాన్-ఇమిగ్రెంట్ ఉపాధి పిటిషన్లు కాగా ఐ-140 యజమానులు ఇచ్చే గ్రీన్‌కార్డు కోసం వాడతారు.. ఇదిలావుంటే, హెచ్1బీ, హెచ్2బీ వీసాల రుసుము రెట్టింపు చేయడం వర్కర్లు చట్టబద్ధంగా అమెరికాకు వస్తారనుకునే విధానకర్తలకు భంగపాటు తప్పబోదని ఆర్థికవేత్తలు అంటున్నారు. కాగా, ప్రీమియం ప్రాసెసింగ్‌లో మారలేదు. పనిదినాలు యథావిధిగా 15రోజులు కొనసాగుతాయి. అయితే 60రోజుల పాటు ప్రజలు వీసాల రుసుము పెంపుదలను వ్యతిరేకించినా అది అమల్లోకొచ్చింది.

ఆరోగ్యకర సమాజం నెలకొల్పండి

వైద్య విద్యార్థులకు గవర్నర్ విశ్వభూషణ్ పిలుపు

విశాలాంధ్ర-రేణిగుంట: ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి వైద్య విద్యార్థులు కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. రేణిగుంట విమానాశ్రయం వద్ద నున్న శ్రీబాలాజీ మెడికల్ కళాశాల, హాస్పిటల్ &రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌ను గవర్నర్ గురువారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు, విద్య అందించేందుకు శ్రీ కంచి కామ కోటి ట్రస్ట్, సాయిరాం ఫౌండేషన్, విజ్ఞాన భారతి చారిటబుల్ ట్రస్ట్ కలిసి వచ్చినందుకు ఈ సంస్థలను అభినందిస్తున్నానని అన్నారు. శ్రీ బాలాజీ మెడికల్ కళాశాలలో 150 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు నేటి నుంచి వైద్య విద్య అందించే కార్యకలాపాలను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. 62 ఐసీయూ పడకలు, 32 అత్యవసర పడకలు, 5 ప్రపంచ స్థాయి ఆపరేషన్ థియేటర్లు, 24 గంటలూ అధునాతన ట్రామా కేర్, సెంట్రల్ ల్యాబ్, రేడియాలజీ సౌకర్యాలతో ఈ కళాశాలలో 350 పడకల ఆస్పత్రి ఏర్పాటయిందని, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అధునాతన వైద్యం, ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. శ్రీ బాలాజీ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ ఉత్తమ వైద్యులను తయారు చేసి సమాజానికి అందిస్తుందని నాకు నమ్మకం ఉందని అన్నారు. ఈ కళాశాల మొదటి బ్యాంచ్ ఎంబీబీఎస్ విద్యార్థులందరికీ గవర్నర్ అభినందనుల తెలిపారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె. నారాయణస్వామి మాట్లాడుతూ... పేదల తలరాతలు మార్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నవరత్నాలు అమలు చేస్తున్నారని చెప్పారు. కులం, మతం చూడకుండా అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలందిస్తున్నారని కొనియాడారు. తన తండ్రి వైఎస్సార్ శంకుస్థాపన చేసిన ఆసుపత్రికి ముఖ్యమంత్రిగా ఆయన కుమారుడి పాలనలో ప్రారంభించుకోవడం సంతోషకరమన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని మాట్లాడుతూ... వైద్య ఆరోగ్య రంగాన్ని నాడు-నేడు పథకం ద్వారా ప్రక్షాళన చేస్తున్నామన్నారు. రూ.1600 కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు మార్చి పేదలకు విలువైన వైద్యం అందించాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని అన్నారు. పేదలకు వైద్య విద్య అందించాలని రూ.8500కోట్లతో కొత్తగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలు తీసుకురావడం మామూలు విషయం కాదని అన్నారు. వీటిలో ఈ ఏడాదే 5 వైద్య కళాశాలలు ప్రారంభం కానున్నాయని ప్రస్తుతం ఉన్న 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2300 సీట్లకు అదనంగా మరో 750 అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. రాష్ట్ర పర్యాటక మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ... నేనూ డాక్టర్ కావాలని తిరుపతి పద్మావతి కళాశాలలో బైపీసీ తీసుకున్నానని, కానీ యాక్టర్ అయి పొలిటిషియన్ గా మారానని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్కరూపాయి ఖర్చు లేకుండా పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి అనేక రాష్ట్రాల పిల్లలు చదువుకోవడానికి ఇక్కడికి రావడం సంతోషంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ కార్యదర్శి ఆర్పీ సిసోడియా, జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి, ప్రజా ప్రతినిధులు, వైద్య విద్యార్థులు వారి తల్లిదండ్రులు, అధికారులు పాల్గొన్నారు.

చీకటి జీఓ రద్దు చేయాలి

ప్రజా సమస్యలపై పోరాటం: రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: జగనన్న ఇళ్ల లబ్ధిదారుకు రూ.5 లక్షలు మంజూరు చేయాలని, జీఓ నెంబరు ఒకటిని వెంటనే రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు సీఆర్ భవన్‌లో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం గురువారం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య హాజరయ్యారు. రామకృష్ణ మాట్లాడుతూ ఈనెల 17 నుండి 30 వరకు జగనన్న ఇళ్ల లబ్ధిదారులతో సంతకాల సేకరణ చేపడతామన్నారు. ఫిబ్రవరి 6వ తేదీన లబ్ధిదారులతో సదస్సు నిర్వహించి కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ఫిబ్రవరి 22న జగనన్న ఇళు, టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం విద్యార్థి, యువజన సంఘాలు జనవరి 20 నుండి ఫిబ్రవరి 4 వరకు చేపట్టిన బసు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. విశాఖ ఉక్కుపరిరక్షణ కోసం ఈనెల 23, 24న రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ డివిజన్‌లలో, 25న కలెక్టరేట్ల ఎదుట దీక్షలు చేపట్టాలన్నారు. ఫిబ్రవరి 8 నుండి 14 వరకు రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులను పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పరిశీలిస్తారన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలన్నారు. సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఎన్.లెనిన్‌బాబు, ఆవుల శేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎన్ రసూల్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.జగన్నాథం, నబీరసూల్, మద్దిలేటి శెట్టి, రామకృష్ణారెడ్డి, రంగన్న, లలితమ్మ, పంపన్నగౌడ్, భాస్కర్‌యాదవ్, చంద్రశేఖర్, విరూపాక్షి, రాజాసాహెబ్, శ్రీరాములు, కారుమంచి తదితరులు పాల్గొన్నారు.

12న రణస్థలంలో జనసేన 'యువశక్తి'

విశాలాంధ్రబ్యూరో-విశాఖపట్నం: ప్రతిపక్షాల సభలను అడ్డుకునే కుట్రలో భాగంగానే జగన్ ప్రభుత్వం జీవో నంబర్1 తీసుకువచ్చిందని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ మండిపడ్డారు. గురువారం సాయంత్రం ఆయన విశాఖలో జనసేన నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. జనవరి 12న శ్రీకాకుళం జిల్లా రణస్థలం వద్ద యువశక్తి కార్యక్రమం జరుపుతున్నామని, మధ్యాహ్నం 12 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఉత్తరాంధ్ర వలసలు, నిరుద్యోగ యువత, మత్స్యకారుల సమస్యలపై చర్చ జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఉపాధి కోసం పెద్ద ఎత్తున ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్నారని, అనేకమంది విగత జీవులుగా తిరిగి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యత గల ప్రతిపక్షంగా జనసేన చేస్తున్న కార్యక్రమాల్ని కూడా ప్రభుత్వం దుర్మార్గంగా అడ్డుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. డీజీపీ కి ఇప్పటికే యువ శక్తి కార్యక్రమం గురించి తెలియజేశామని, దాదాపు 100మంది యువతకు మాట్లాడే అవకాశం కల్పిస్తామని అన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి యువత పెద్ద ఎత్తున తరలివస్తామంటున్నారని, రాబోయే వారం రోజుల్లో తామంతా ఈ కార్యక్రమం ఏర్పాట్లలోనే ఉంటామన్నారు. 175 కు 175 అసెంబ్లీ స్థానాలు గెలుస్తామని గొప్పలు పోయిన సీఎం జగన్... ప్రతిపక్షాల సభలను ఎందుకు అడ్డుకుంటున్నారని మనోహర్ ప్రశ్నించారు. సీఎం మాత్రం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ సభలు పెట్టడం, హెలికాప్టర్ ప్రయాణాలు చెయ్యొచ్చా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాలకు రాకపోతే పెన్షన్లు తీసేస్తామని అధికారపార్టీ భయపెడుతోందన్నారు. పర్యటనల్లో బాధితులు రావడం, సీఎం వారికి సహాయం చేయడం అంతా నాటకమేనని విమర్శించారు. ప్రజల్లో పెన్షన్‌లు తొలగిస్తున్నారని ఎప్పుడైతే ఆందోళన మొదలైందో అందరి దృష్టి మరల్చడానికి ప్రతిపక్ష సభల రద్దు కోసం జీవో తెచ్చారన్నారు. టీఆర్ఎస్ పార్టీ తో ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో చీలిక తెచ్చింది కేసీఆర్ అని ఇప్పుడు బీఆర్ ఎస్ ఏర్పాటుతో ఏపీ కి న్యాయం ఎలా చేస్తారని మనోహర్ ప్రశ్నించారు. కేసీఆర్ లో నిజాయితీ ఉండాలని, జగన్ కు సాయం అందించడానికి జనసేన ఓటు చీల్చడానికే బీఆర్ఎస్ పెట్టారన్నారు. అనంతరం యువశక్తి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు శివశంకర్, బొలిశెట్టి సత్యనారాయణ, కోన తాతారావు, పీతల మూర్తి యాదవ్, పరుచూరి భాస్కరరావు, పసుపులేటి ఉషాకిరణ్, రాజు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యకు పెద్దపీట: బొత్స

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. కళాశాల, ఉన్నత విద్యా శాఖ అధ్వర్యంలో నూతన విద్యా విధానంపై గురువారం విజయవాడ మురళీ ఫార్చ్యూన్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లైఫ్ స్కిల్స్-4, స్కిల్ డెవలప్‌మెంట్-13 కలిపి మొత్తంగా 17 కోర్సుల పాఠ్య పుస్తకాలను మంత్రి విడుదల చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులకు శిక్షణ కోసం మంత్రి ఆధ్వర్యంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)తో విద్యాశాఖ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. 'కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ (సీఎస్‌పీ) అవార్డులను రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున బహుమానాన్ని మంత్రి విద్యార్థులకు అందజేశారు. 'స్టూడెంట్, ఫ్యామిలీ, కమ్యూనిటీ' నినాదంతో ఇన్‌క్లూసివ్ సెంట్రీ (సీఎస్‌పీ) లోగోను మంత్రి బొత్స సత్యనారాయణ ఆవిష్కరించారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందుందని బొత్స అన్నారు. కాలానుగుణంగా పాఠ్యప్రణాళికలను మార్పులు, చేర్పులు చేస్తామని, ఇప్పటికే లక్షా 40 వేల మంది విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ ద్వారా శిక్షణ ఇప్పిస్తున్నామని వివరించారు. ఇప్పుడు మరింత మంది విద్యార్థులకు మేలు కలిగిలా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)తో ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. నూతన కోర్సులను తీసుకురావడం, ప్రతి మండలంలో రెండు జూనియర్ కాలేజీలు, ప్రతి నియోజకవర్గంలో ఒక డిగ్రీ కాలేజీ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు మాట్లాడుతూ విద్య, వైద్య, ఆరోగ్య రంగాలను టాప్-3గా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంట వాటిలో టాప్-1గా విద్యాశాఖ నిలిచిందన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కె. హేమచంద్రారెడ్డి కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యక్తి వికాస కేంద్ర ఇండియా సీఈవో దిగ్విజయ్, కళాశాల విద్య శాఖ ఏజీవో డాక్టర్ సీహెచ్.తులసి, ఓఎస్డీ డాక్టర్ పి. అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు ఆపకుంటే... మరో ఉద్యమం: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్మార్ట్, ప్రీపెయిడ్, ట్రూఅప్ చార్జీల పేరుతో వినియోగ దారులపై వేలకోట్ల భారాలు మోపుతున్నారని, వాటిని ఆపకుంటే మరో విద్యుత్ ఉద్యమం నిర్వహిం చాల్సి వస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు హెచ్చరించారు. గురువారం విజయవాడ బాలోత్సవ భవనంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారాలపై వినియోగదారులు ప్రశ్నించాలని, ట్రేడ్‌యూనియన్లు, ప్రజా సంఘాలు ముందుకొచ్చి పోరాడాలని కోరారు. వ్యవసాయ మీటర్ల వినియోగదారులపై ఆరువేల కోట్ల రూపాయల భారం పడుతుందని వివరించారు. రెగ్యులేటరీ కమిషన్ అనుమతి లేకుండా మీటర్లు కొనుగోలు చేయరాదని, అయినా ఏకపక్షంగా కొనుగోలు చేశారని తెలిపారు. దీన్ని కమిషన్ ముందుకు వచ్చి విచారించాలన్నారు. శ్రీకాకుళం జిల్లాలో పెట్టిన మీటర్లపై ప్రయాస్ ఎనర్జీగ్రూప్ విచారణ చేసిందని, ఈ నివేదికను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. హరిత ఎనర్జీ పేరుతో 75 వేల ఎకరాలను అదానీకి కట్టబెట్టేందుకు ప్రభుత్వం పూనుకుంటోందని వివరించారు. మోదీ ఆదేశాల మేరకే రాష్ట్రం ఈ చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మన్యం, అల్లూరి జిల్లాల్లో గిరిజనులను రోడ్డున పడేసేందుకు రాష్ట్రం సిద్ధమైందని తెలిపారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలనీ, అదానీకి భూములు ఇవ్వొద్దని వారు డిమాండు చేశారు. విదేశీ కంపెనీలతో జాయింట్ వెంచర్ నిర్వహిస్తున్న అదానీ, అంబానీలకు ఉపయోగమని వివరించారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో ఏడాదికి మూడు వేల నుంచి ఐదువేల కోట్లు భారం విధిస్తున్నారని ధ్వజమెత్తారు. ట్రూఅప్ ఛార్జీలు అనేది అసమంజసమైనదని, ఆ పేరుతో వేలకోట్లు వసూలు చేయడం సరికాదన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధమే

ప్రమాదాల నివారణకే జీవో: మంత్రి నాగార్జున

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కోవడానికి వైసీపీ సిద్ధంగా ఉందని మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. విశాఖలో మంత్రి గురువారం మీడియాతో మాట్లాడారు. 'కందుకూరు, గుంటూరు తరహా తొక్కిసలాటలు మళ్లీ జరగకుండాఉండేందుకే ప్రభుత్వం జీవో నంబరు 1 తెచ్చిందని, ఈ జీవో చంద్రబాబు కోసం కాదన్నారు. సీఎం జగన్ సహా అందరూ దీనికి కట్టుబడి ఉండాలన్నారు. జీవో వచ్చాక సీఎం జగన్ రోడ్‌షో చేయలేదని స్పష్టంచేశారు. లోకేశ్ పాదయాత్రను తాము ఆపేది లేదన్నారు. వైసీపీ వ్యతిరేక పార్టీలన్నీ జగన్నాథ రథయాత్ర చక్రాల కింద నలగాల్సిందేనన్నారు. విశాఖ కేంద్రంగా త్వరలోనే పరిపాలన ప్రారంభిస్తామన్నారు. అయితే దీనిని కొన్నిశక్తులు అడ్డుకుంటున్నాయని, సాంఘిక సంక్షేమ హాస్టళ్లను బాగా అభివృద్ధి చేశామని మంత్రి నాగార్జున గుర్తుచేశారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీలకు నూతన భవనాలతో పాటు మౌలిక వసతులు కల్పించామన్నారు. అంతకుముందు విశాఖపట్నం ప్రభుత్వ అతిథి గృహంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, ఎస్సీ కార్పొరేషన్, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో విద్య, మధ్యాహ్న భోజనం, వసతి తదితర అంశాల గురించి అధికారులతో మాట్లాడారు. సాంఘిక సంక్షేమ శాఖను మరింత బలోపేతం చేయటానికి ప్రభుత్వం మరింత కృషి చేస్తున్నదని మంత్రి చెప్పారు. అంతకుముందు శ్రీకాకుళం జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో సమావేశమయ్యారు. పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. విశాఖపట్నం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, శ్రీకాకుళం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ గెడ్డమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామారావు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాల్స్, జిల్లా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఎర్రచందనం అమ్మకానికి కేంద్రం అనుమతి

విశాలాంధ్ర-గుంటూరు: ఎర్రచందనం అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో ఆదాయం చేకూర్చడానికి అటవీ శాఖ అన్ని చర్యలు తీసుకుంటోందని అటవీ శాఖ ప్రధాన ముఖ్య సంరక్షణ అధికారి వై.మధుసూదన రెడ్డి తెలిపారు. గురువారం అటవీ శాఖ ప్రధాన కార్యాలయంలో ఎర్రచందనం కొనుగోలు దారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం దగ్గర ఉన్న ఎర్రచందనం నిల్వలను వేలంపాట నిర్వహించడానికి ముందుగా ఎర్రచందనం బయ్యర్లు, ఏజెన్సీలను అవగాహన కోసం ఆహ్వానించామని తెలిపారు. ప్రభుత్వానికి వీలైనంత ఎక్కువ రెవెన్యూ సాధించడమే లక్ష్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యర్థన మేరకు భారత ప్రభుత్వం 5,300 మెట్రిక్ టన్నుల ఎర్రచందనం అమ్మడానికి అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ కార్పొరేషన్‌ను ఏజెంట్ ఫర్ సేల్ అండ్ ఎక్స్‌పోర్ట్‌గా ఏపీ ప్రభుత్వం అపాయింట్ చేసిందని తెలిపారు. మొత్తం సేల్ ఏపీఎఫ్‌డీసీ చేస్తుందన్నారు. ఈ-టెండర్, ఈ-ఆక్షన్ విధానం ద్వారా గ్లోబల్ సేల్ నిర్వహించనున్నామని పీసీసీఎఫ్ మధుసూదన రెడ్డి వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆక్షన్ నిర్వహించడానికి ప్రాథమికంగా నిర్ణయించామన్నారు. ఎర్రచందనం అమ్మకం విషయంలో ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ పూర్తి స్పష్టతతో ఉందని, ప్రభుత్వానికి ఆదాయం తీసుకురావడమే లక్ష్యంగా తమ చర్యలు ఉంటాయన్నారు. గతంలో జరిగిన టెండర్లు ఏవిధంగా జరిగాయో పరిశీలించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయి పారదర్శకతతో టెండర్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. దేశవిదేశాల నుంచి వచ్చే బయ్యర్లు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వపరంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని వివరించారు. ఇండియా, హాంకాంగ్ దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. పీసీసీఎఫ్ ప్రొడక్షన్ ఆర్పీ ఖజూరియా, ఫారెస్ట్ కార్పొరేషన్ సీజీఎం రేవతి, జీఎం గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

విశాలాంధ్ర- జేఎన్టీయూఏ: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (అనంతపురం)లో ఈసీఈ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి చాణక్య (19) గురువారం తెల్లవారుజామున హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నెల్లూరు జిల్లా ఉదయగిరి చెందిన చాణక్య స్నేహితులతో కలిసి సంతోషంగా ఉండేవాడని చెబుతున్నారు. తెల్లవారుజామున 5.30 గంటలకు తన స్నేహితులకు 'బై' అని సందేశం పంపి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మొదటి సంవత్సరంలో 9.8 జీపీఏ సాధించాడు. ఆత్మహత్య పాల్పడ్డానికి కారణం తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఎఫ్ మాజీ నేత చంద్ర రజనికి ప్రవాసి భారతీయ సమ్మాన్ అవార్డు

సీపీఐ, సీఆర్ ఫౌండేషన్‌కు రూ.50వేల విరాళం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) మాజీ నేత డాక్టర్ చంద్ర రజనికి అత్యంత ప్రతిష్టాత్మక ప్రవాసి భారతీయ సమ్మాన్ అవార్డు లభించింది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 140 దేశాల్లో నివసిస్తున్న ప్రవాస భారతీయులు ఆయా దేశాల్లో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న 30 మందిని గుర్తించి రెండేళ్ల కొకసారి భారత ప్రభుత్వం ఈ అవార్డుకు ఎంపిక చేస్తుంది. దీనిలో భాగంగా రష్యాలో వైద్యరంగంలో విశేష సేవలందిస్తున్న డాక్టర్ చంద్ర రజనిని గుర్తించిన భారత ప్రభుత్వం 2021 ప్రవాసి భారతీయ సమ్మాన్ అవార్డుకు ఎంపిక చేసింది. కృష్ణాజిల్లా మంగళాపురం గ్రామానికి చెందిన చంద్ర వెంకట కృష్ణయ్య, కమలాంబ దంపతులకు జన్మించిన రజని ప్రాథమిక విద్యను చల్లపల్లిలో, డిగ్రీ వరకు విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలలో పూర్తి చేశారు. ఆ సమయంలో విద్యార్థి సమాఖ్య ఉద్యమాల్లో ఆమె చురుకుగా పనిచేశారు. ఆంధ్రా యూనివర్శిటీలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తున్న సమయంలో ఉన్నత చదువులకు రష్యా వెళ్లే అవకాశం భారత కమ్యూనిస్టుపార్టీ ద్వారా లభించింది. రష్యాలో మెడిసిన్ పూర్తి చేసిన రజని ఆ తర్వాత డాక్టర్‌గా అక్కడే స్థిరపడ్డారు. కొద్దిరోజుల క్రితం భారత్‌కు విచ్చేసిన డాక్టర్ రజనిని విజయవాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గసభ్యులు అక్కినేని వనజ, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, సామాజిక ఉద్యమకారులు టి.లక్ష్మీనారాయణ, కృష్ణాజిల్లా పార్టీ కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి టి. తాతయ్య, విజయవాడ నగర సీపీఐ నేతలతో పాటు ఆమె బంధువులు, స్నేహితులు పెద్దసంఖ్యలో కల్సి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థి దశ నుంచి కమ్యూనిస్టు ఉద్యమానికి అందించిన సేవలు, సహకారాన్ని, వృత్తి నిర్వహణలో అంకితభావంతో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను వక్తలు కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు చేజిక్కించుకోవాలని, దేశ ఖ్యాతిని, తెలుగు జాతి ప్రతిష్ఠను అంతర్జాతీయస్థాయిలో ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.

సీపీఐ, సీఆర్ ఫౌండేషన్‌కు రూ.50వేల విరాళం

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు పార్టీకి రూ.25వేలు, సీఆర్ ఫౌండేషన్‌కు రూ.25వేల విరాళాన్ని ప్రకటించిన డాక్టర్ రజని, ఆమేరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణకు నగదును అందజేశారు.



వీసీల సదస్సుకు ఏయూ ఆతిథ్యం

విశాలాంధ్ర-విశాఖసిటీ: అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) సౌత్‌జోన్ విశ్వవిద్యాలయాల ఉపకులపతుల సదస్సుకు ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆతిథ్యం ఇవ్వనుంది. జనవరి 31, ఫిబ్రవరి 1వ తేదీలలో ఏయూ వేదికగా సదస్సు జరగనుంది. గురువారం ఉదయం ఏయూ పాలకమండలి సమావేశ మందిరంలో సదస్సు నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలతో వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి సమావేశమయ్యారు. జనవరి 31 ఉదయం బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్లో ప్రారంభ కార్యక్రమం జరుగుతుందని, అనంతరం ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్, పూర్వ విద్యార్థుల సంఘ సమావేశ మందిరం, ఐఐఎం స్మార్ట్ క్లాస్ రూమ్ లో సెషన్స్ జరుగుతాయని వివరించారు. అదే రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దక్షిణభారతదేశంలోని విశ్వవిద్యాలయాలకు చెందిన 150 మందికి పైగా ఉపకులపతులు ఈ సదస్సుకు హాజరవుతారన్నారు. రెండు రోజుల పాటు వీరికి ఏయూ ఆతిథ్యం ఇస్తుందని, విభిన్న రంగాలకు చెందిన 20 మంది వరకు నిపుణులు, వక్తలు, ఏఐయూ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

అరసం అధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

విశాలాంధ్ర-తెనాలి: అభ్యుదయ రచయితల సంఘం 19వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని పాఠశాల, కళాశాల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన సంఘం కార్యవర్గ సభ్యుడు ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి తెలిపారు. తెనాలి సీపీఐ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అరసం 80 సంవత్సరాల తరువాత ప్రతిష్ఠాత్మకంగా ఫిబ్రవరి 11, 12 తేదీల్లో తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో జరగనున్న అరసం 19వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని పాఠశాల, కళాశాల విద్యార్థులకు అనేక రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జనవరి 21, 22 తేదీల్లో ఉదయం తాలూకా జూనియర్ కళాశాలలో జరుగనున్న ఈ పోటీల్లో 8 నుంచి 10వ తరగతి విద్యార్థుల కేటగిరిలో కథ చెప్పండి, వ్యాస రచన, వక్తృత్వం మూడు విభాగాల్లో పోటీలను నిర్వహిస్తారన్నారు. పంచతంత్ర, చందమామ, బాలమిత్ర, చెకుముకిలాంటి పత్రికల్లోని ఒక కథను ఏడు నిముషాలకు మించకుండా చెప్పాలి, 'పుస్తక పఠనం- ప్రయోజనాలు' అనే అంశంపై మూడు పేజీలు మించకుండా 45 నిమిషాలలో వ్యాసం రాయాలి. వక్తృత్వ పోటీల్లో భాగంగా 'స్వాతంత్ర్యోద్య మంలో తెనాలి ప్రాముఖ్యత' అనే అంశంపై ఎనిమిది నిముషాలలోపు ప్రసంగించాలి. ప్రతి కేటగిరిలో ఒక్కో పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థులు మాత్రమే పాల్గొనాలి. ఈ విభాగంలోని ప్రతి అంశంలో రూ.1000 (ప్రథమ), రూ.750 (ద్వితీయ), రూ.500 (తృతీయ) బహుమతులు ఉంటాయి. ఇదే విధంగా ఇంటర్, డిగ్రీస్థాయి కళాశాల విద్యార్థులకు సాహిత్య క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం పోటీలు జరుగుతాయి. ప్రతి అంశంలో ఒక్కో కళాశాల నుండి ఇద్దరు మాత్రమే పాల్గొనాలి. తెలుగు భాష, సాహిత్యాలకు సంబంధించిన ప్రశ్నలు క్విజ్‌లో ఉంటాయి. 'తెనాలి పరిసర ప్రాంత ఆధునిక రచయితలలో 'మీకు నచ్చిన ఒక కథా రచయిత' గురించి వ్యాసం రాయాలి. వక్తృత్వంలో భాగంగా 'గురజాడ దేశభక్తి గేయం-విశిష్టత' అనే అంశంపై ప్రసంగించాలి. ఈ విభాగాల్లోని ప్రతి అంశంలో రూ.1250 (ప్రథమ), రూ.1000 (ద్వితీయ), రూ.750 (తృతీయ) బహుమతులు ఉంటాయి. ఆసక్తి గల బాలబాలికలు జనవరి 19లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలి. వివరాలకు చెరుకుమల్లి సింగా- 9177174389, కనపర్తి బెన్‌హర్- 7729971471 నంబర్లను సంప్రదించాలన్నారు. విజేతలైన విద్యార్థులకు ఫిబ్రవరి 11, 12న జరిగే అరసం రాష్ట్ర మహాసభలలో ప్రముఖుల చేతులమీదుగా నగదుతో పాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందజేస్తారని కృపాచారి తెలియజేశారు. విలేకర్ల సమావేశంలో అరసం ఆహ్వాన సంఘ కార్యవర్గ సభ్యులు గోగినేని కేశవరావు, షేక్ అబ్దుల్ హకీం జాని, దేవిశెట్టి కృష్ణారావు, కొండమూడి రమేష్‌బాబు, వెనిగళ్ళ నారాయణ ప్రసాద్ ప్రభృతులు పాల్గొన్నారు.

స్మైలెక్స్ ఫార్మా కంపెనీలో ప్రమాదం: పెయింటర్ మృతి

విశాలాంధ్ర-పరవాడ(అనకాపల్లి జిల్లా): అనకాపల్లి జిల్లా పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలో గురువారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. స్మైలెక్స్ ఫార్మా కంపెనీలో నిర్మాణం జరుగుతున్న బ్లాక్‌కు పెయింటింగ్ వేస్తుండగా తాడి తెగి పెదగంట్యాడ మండలం అప్పికొండ శివారు మురుబాయి గ్రామానికి చెందిన ఇద్దరు కార్మికులు 18 మీటర్ల ఎత్తు నుంచి కింద పడిపోయారు. ఇందులో మేడిశెట్టి పైడిరాజు(38) అక్కడికక్కడే మృతిచెందగా, మరో కార్మికుడు ఒనుము అప్పారావు తీవ్రంగా గాయపడ్డాడు. అప్పారావును గాజువాకలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సరైన భద్రత ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే ప్రమాదం జరిగినట్లు తోటి కార్మికులు ఆరోపించారు. కాగా, మృతి చెందిన కార్మికుని కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని బంధువులు, కార్మిక నేతలు కంపెనీ గేటు ఎదుట ఆందోళనకు దిగారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో గిరిజనుడి హత్య

విశాలాంధ్ర-చింతూరు (అల్లూరి జిల్లా): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం బురకనకోట గ్రామంలో సోయం సుబ్బయ్య (40) అనే గిరిజనుడిని మావోయిస్టులు గత రాత్రి హత్య చేశారు. బురకన కోటలో నివసిస్తున్న సుబ్బయ్య పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని గతంలో హెచ్చరించినప్పటికీ తమ మాట పెడచెవిన పెట్టాడని అందుకే తాము శిక్షించామని మృతదేహం పక్కన మావోయిస్టులు ఒక లేఖను ఉంచారు. సుబ్బయ్య భార్య విలేకరులతో మాట్లాడుతూ బుధవారం రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో తమ ఇంట్లో ఉండగా సాయుధులైన 10మంది మావోయిస్టులు తన భర్తను తీసుకెళ్లి చంపేశారని రోదించింది. చింతూరు సీఐ అప్పలనాయుడు, ఎస్సై యాదగిరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంపాదకీయం

న్యాయం మిగిలే ఉంది!

సుప్రీంకోర్టు పుణ్యమా అని ఉత్తరాఖండ్‌లో 50,000 మందికి ఊరట కలిగింది. హల్ద్వానీలో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న 4,000 కుటుంబాలకు చెందిన 50,000 మందిని అక్కడి నుంచి తొలగించాలని ఉత్తరాఖండ్ హైకోర్టు జారీచేసిన ఉత్తర్వు అమలును సుప్రీంకోర్టు గురువారం నిలిపివేసింది. రాత్రికి రాత్రి ఇన్ని వేలమందిని నిరాశ్రయులను చేయడం కుదరదు. ఇది మానవీయ సమస్య. దీనికి ఆచరణ యోగ్యమైన పరిష్కారం కనుగొనాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వు అమలును నిలిపివేయాలని సీనియర్ న్యాయవాది, సామాజిక కార్యకర్త ప్రశాంత్ భూషణ్ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్ర చూడ్, న్యాయమూర్తులు ఎస్.ఎ.నజీర్, పి.ఎస్.నరసింహతో కూడిన బెంచి ఈ ఉత్తర్వులు జారీచేసింది. దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న వారిని ఒక్క ఉదుటున సాయుధ పోలీసు బలగాలను నియోగించి బలవంతంగా ఎలా ఖాళీ చేయిస్తారని కూడా న్యాయమూర్తులు ప్రశ్నించారు. ఈ కేసును మళ్లీ వచ్చే నెల సుప్రీంకోర్టు విచారించవలసి ఉంది. అయితే ఈ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు జరపకూడదని కూడా అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వుల మాట ఎలాఉన్నా ఎముకలు కొరికే చలి ఉన్నప్పుడు ఒక్క సారి నిరాశ్రయులను చేయడం మానవత్వం ఉన్న వారు ఎవరూ సహించలేరు. ఈ భూమి తమదని రైల్వేశాఖ అంటోంది. అక్కడ ఉంటున్న వారందరూ పేదలే. అందులో ముస్లింలే ఎక్కువ. హల్ద్వానీ రైల్వే స్టేషన్ పక్కన గఫూర్ బస్తీ, ధోలక్ బస్తీ, ఇందిరా నగర్ ప్రాంతాలలో దాదాపు రెండు కిలోమీటర్ల పొడవున ఈ పేదలు ఉంటున్నారు. తమను గూడులేని వారిని చేయకూడదని ఆ పేదలు కొవ్వొత్తుల ప్రదర్శన, బైఠాయింపులు, ప్రార్థనలు కొనసాగిస్తున్నారు. విచిత్రం ఏమిటంటే అక్కడ ఇళ్లున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 11 ప్రైవేటు పాఠశాలలు, ఒక బ్యాంకు, రెండు నీటి ట్యాంకులు, పది మసీదులు, నాలుగు గుళ్లు, అనేక దుకాణాలు ఉన్నాయి. ఇవన్నీ ఒక్క రోజులో వెలిసినవి కావని బధిరాంధులకు కూడా అర్థం అవుతుంది. ఇవన్నీ కొన్ని దశాబ్దాలుగా నిర్మితమైనవే. ఆ పరిసరాల్లో అక్రమంగా నదిలోంచి ఇసుక తవ్వేస్తున్నారని 2013లో కోర్టులో కేసు దాఖలైంది.

హైకోర్టు వీరందరినీ ఖాళీ చేయించమని ఉత్తర్వు జారీచేసిన తరవాత గత డిసెంబర్ 20న ప్రభుత్వ విభాగం అక్కడినుంచి ఖాళీచేసి వెళ్లిపోవాలని నోటీసు జారీ చేసింది. వచ్చే తొమ్మిదవ తేదీలోగా డబ్బా డవాలు సర్దుకుని ఖాళీ చేయాలని ఆ నోటీసు సారాంశం. దీనితో అక్కడ నివాసం ఉంటున్నవారు ఉద్యమం ప్రారంభించారు. ఈ ఉత్తర్వుల ప్రకారం పిల్లలు, గర్భిణులు, వయసుపై బడ్డవారు మూటాముల్లె సర్దుకుని వెళ్లిపోక తప్పని పరిస్థితి ఎదురైంది. సుప్రీంకోర్టు ఆదేశం తాత్కాలికంగానైనా వారికి ఉపశమనం కలిగిస్తుంది. సుప్రీంకోర్టు ఉత్తర్వును గౌరవిస్తామని ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ అంటున్నారు. విచిత్రం ఏమిటంటే వీరిని ఏడురోజుల్లోగా ఖాళీ చేయించాలని ఉత్తరాఖండ్ హైకోర్టు ఫర్మానా జారీచేసింది. ఈ సమస్యకు ఆచరణ సాధ్యమైన పరిష్కారం కనుగొనాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఉత్తరాఖండ్ ప్రభుత్వానికి, రైల్వేశాఖకు కూడా నోటీసులు జారీ చేసింది.

ఇక్కడ నివాసం ఉంటున్న వారు జిల్లా కోర్టుల్లో దాదాపు వెయ్యి అర్జీలు పెట్టుకున్నారు. ఇక్కడ నివసిస్తున్న వారికి ఆ భూమిని లీజుకు తీసుకున్నారు. కొందరు ప్రభుత్వం వేలంవేస్తే కొనుక్కున్నారు. ఒక వేళ ఇది రైల్వేలకు చెందిన భూమే అనుకున్నా అక్కడ 50 ఏళ్లకు పైగా కాపురం ఉంటున్నవారు ఉన్నారుగా, అలాంటప్పుడు వారికి పునరా వాసం ఏర్పాటు చేయాలిగా అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి సంజయ్ కిషన్ కౌల్ నిలదీశారు. ఇది మానవీయ సమస్య అని ఆయన గుర్తు చేశారు.

నిర్వాసితులు కాబోయే వారి వాదన వినకుండానే ఉత్తరాఖండ్ హైకోర్టు ఖాళీ చేయించమని ఆదేశించడాన్ని మరో న్యాయమూర్తి ఓకా తప్పు పట్టారు. కరోనా మహమ్మారి విలయ తాండవం చేస్తున్న సమయంలో ఇంతకు ముందు కూడా కోర్టు వారిని ఖాళీ చేయించమని ఆదేశించడం మరో వైపరీత్యం. నివాసితులను ఇప్పుడు ఆక్రమణదార్లు అంటున్నారు. ఇది నిజానికి వ్యవసాయేతర భూమి. అది ప్రభుత్వ భూమి. దీనిని ప్రభుత్వం లీజుకు ఇవ్వొచ్చు. అన్నింటికీ మించి ఇది తమ భూమి అని వాదిస్తున్న రైల్వేశాఖ దానికి సంబంధించిన ఆధారాలు ఏమీ చూపలేదు. రాష్ట్రంలో వచ్చిన సంస్కరణలను, నిర్మాణాలను క్రమబద్ధం చేయడం, పునరావాసం కల్పించడం లాంటి అంశాలను పట్టించుకోకుండా హైకోర్టు ఖాళీ చేయించమని ఆదేశించిందని బాధితులు ఆరోపిస్తున్నారు.

చాలా మంది దగ్గర చట్టబద్ధమైన ఆక్రమణ దార్లన్న పత్రాలు కూడా ఉన్నాయి. ఈశాన్య రైల్వేశాఖ ఒకసారి 78 ఎకరాలు తమదేనని, దాన్ని ఆక్రమించారని, మరోసారి 29 ఎకరాలు ఆక్రమించారని అంటోంది. ఈ ఆక్రమణ వివాదం 2007లోనే బయటకు వచ్చింది. తమకు చెందిన 29 ఎకరాలలో 10 ఎకరాలలో ఖాళీ చేయించామని ఈశాన్య రైల్వే ఉత్తరాఖండ్ హైకోర్టుకు తెలియజేసింది. ఆక్రమిత ప్రాంతాన్ని ఖాళీ చేయించమని ఆదేశించాలని అభ్యర్థించింది. ఆ తర్వాత చాలాకాలం ఈ విషయంలో ఏ కదలికా లేదు.

హైకోర్టు ఉత్తర్వుతో ఇప్పుడు మళ్లీ అలజడి మొదలైంది. గతంలో అక్కడి నిర్వాసితులను ఖాళీ చేయించాలని కోర్టు ఆదేశించినప్పుడు రైల్వేభూమి ఇది అని కచ్చితంగా చెప్పే అవకాశంలేదని ప్రభుత్వం చెప్పింది. పైగా కొంతమంది చట్టబద్ధంగానే అక్కడ భూమి కొన్నారు. ఈ భూమి ప్రభుత్వానిదేనని వాదించడం ఈ కథలో మరో మలుపు. 2017లో కూడా హైకోర్టు అక్కడ నివసిస్తున్న వారిని ఖాళీ చేయించాలని ఆదేశించింది. అప్పుడు బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2014లో ఈ అంశంపై ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైనప్పుడూ అక్కడి నిర్వాసితులు ఆక్రమణదార్లని అననేలేదు. ఈ ప్రాంతంలో 1947 స్వాతంత్ర్యం రావడానికి ముందు నుంచే ఉన్న కట్టడాలు కూడా ఉన్నాయి. మధ్యలో ఈ వివాదాన్ని పరిష్కరించడానికి ఒక ఎస్టేట్ అధికారిని నియమించారు. ఆయన ఏ ఆధారం చూపకుండానే ఇది ఈశాన్య రైల్వే స్థలం అని తేల్చేశారు. మరీ విచిత్రం ఏమిటంటే ముందు 29 ఎకరాలలో ఆక్రమణదార్లు అన్నప్పటికీ ఇప్పుడు 78 ఎకరాలలో ఆక్రమణదార్లు ఉన్నారంటున్నారు. వివిధ స్థాయిల్లోని కోర్టుల్లో ఈ సమస్య పరిష్కారం కావడానికి ఎంత సమయం పడుతుందో తెలియదు కానీ సుప్రీంకోర్టు మానవీయ దృక్పథంతో పేదలను ఆదుకున్నందుకు అభినందించాల్సిందే. న్యాయం ఇంకా మిగిలే ఉందనుకోవాలి. ఆక్రమణదార్లు అంటున్న ఈ ప్రాంతంలో ఇంత వరకు బీజేపీ ఒక్క సారి కూడా గెలవకపోవడం కొసమెరుపు.

స్వభాష అవసరమే

రా బావ ఏమయిపోయావ్ దాదాపు వారం అయింది వచ్చి. పార్వతి మీ అన్నయకు కూడా కాఫీ పట్టుకురా- చెప్పు అబ్బాయి దగ్గరికి హైద్రాబాదు కెళ్లావా ఏంటి. లేదు వెడితే నీతో చెప్పేవాడిని కదా. నాలుగు రోజులు జలుబు, జ్వరం యిబ్బంది పెట్టాయి. రెండు రోజులు ప్రపంచ తెలుగు మహాసభలకు వెళ్లాను. అదా సంగతి బాగా ఎంజాయ్ చేశావన్న మాట. అదిగో అదే వాళ్లు వద్దంటున్నారు ఇపుడు. నువు ఎంజాయ్ పదం వాడావు కదా అదెందుకు, మనం తెలుగువాళ్లం మాతృభాష తల్లితో సమానం. శ్రీ కృష్ణదేవరాయలు అన్ని భాషల్లోకి తెలుగు లెస్స అన్నాడు ఇంగ్లీషు వదిలేయండి అన్నాడు. తెలుగులో వ్యక్త పరచిన భావాలు ఇతర భాషల్లో సాధ్యంకాదు అందుకని ఇంగ్లీషును దూరంపెట్టండి అంటున్నారు బావ. ఎంతోమంది గొప్పవాళ్లు వచ్చి మాట్లాడారు. వెంకయ్యనాయుడు కూడ మాట్లాడారు. వెంకయ్యనాయుడు ప్రాసతో ఊపిరి పీల్చుకోకుండా మాట్లాడేవారు. యన్.టి.ఆర్ ముఖ్యమంత్రిగా వున్న సమయంలో అసెంబ్లీలో అలా మాట్లాడి పడిపోతే అప్పుడు యన్‌టిఆర్ సీటు నుండి లేచి పట్టుకోవడానికి పరుగుపెట్టారు బావ. కాని బావ మాతృభాషను మృతభాషగా మార్చారని ప్రస్తుత ప్రభుత్వం ఇంగ్లీషు మీడియం ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశపెట్టి మరీ చంపేస్తోందని అవేదన వ్యక్తం చేశారు బావ. నిజమే కాని బావ ఇంతకుముందు కార్పొరేట్ స్కూళ్లలో ఇంగ్లీషు మీడియం ఉందిగద. కనీసం అమ్మానాన్న అని పిలువకుండా, మమ్మీ, డాడి అని అలవాటు చేసినప్పుడు వీరంతా ఎక్కడున్నారు. కనీసం పేపరు ప్రకటనలు కూడా యివ్వలేదు. అది నిజమే బావ నాకొక సంఘటన గుర్తుకొస్తోంది. నేను హైస్కూల్లో చదువుకునేటప్పుడు నెమ్మని వెంకటశాస్త్రిగారని తెలుగు

మాష్టారుండేవారు. ఈ మధ్య ఆయన విజయవాడలో కూతురు దగ్గరున్నారని తెలిసివెళ్లాను. ఆయనకు నేనంటే యిష్టం బావ. ఎందుకంటే పద్యాలు రాగయుక్తంగా అప్పచెప్పేవాడిని. ఆయన మంచంపై తలకుగుడ్డ చుట్టుకుని పడుకున్నాడు. కొడుకు అమెరికా నుంచి వచ్చాడట వాడు నా క్లాసుమేట్. అరె కృష్ణ వాడిని వచ్చినదారినే అమెరికా వెళ్లి పొమ్మను. వాడు తెలుగువిని నేను బతకలేను అన్నారు. అరె కృష్ణ నేనేమీ అనలేదు. నాన్న గారి కోరికమేరకు తెలుగుసభలకు వెళ్లాను. నాన్న నేను కూడా తెనుంగులో కత రాత్తా అన్నా. అంతే ఆయనకు ఎక్కడ లేని కోపం వచ్చింది.

నిజమే బావ తెలుగును అలా ఖూనిచేస్తే ఎవరికైనా బాధే. కానీ బావ గతంలో 70శాతం పైగా గ్రామాల్లోనే నివశించి వ్యవసాయం, కుల వృత్తులతో జీవనం చేసేవారు. విద్యాధికులు అమరం వేదం, ఉపనిషత్తులు చదివి చదువులేనివారికి చెప్పేవారు. ఆ తరువాత బాగా చదివినవారు శతావధానం జరిపేవారు. అదొకానందం. కాని ఇప్పుడు వ్యవసాయదారుని కొడుకు, కూలివాని కొడుకులు కులవృత్తులు వదిలి ఉద్యోగంకోసం వెంపర్లాడుతున్నారు. నిజమేబావ నా కొడుకు నాలాగ మట్టి పిసుక్కోవడం నాకిష్టంలేదని ప్రతి తండ్రి ఓపిక లేకపోయినా అప్పు చేసైనా కార్పొరేషన్ స్కూలులో చదివించడానికి ప్రయత్నిస్తున్నాడు. తప్పేమి ఉంది బావ. మొన్నమొన్నటి వరకు ఉద్యోగస్థుల పిల్లలు ఉద్యోగాలు చేస్తుంటే రైతు పిల్లలు వ్యవసాయం, కూలివాని పిల్లలు కూలిపనికి వెళ్లేవారు. కాని ప్రస్తుతం అందుకు ఏ తల్లిదండ్రులు ఒప్పుకోవడంలేదు బావ. నిజమే ఉన్నవారికే చదువు, ఉద్యోగం అంటే అది తప్పేగా బావ. అందుకే ప్రభుత్వ స్కూల్లో కూడా ఇంగ్లీషు మీడియం పెట్టింది ప్రస్తుత ప్రభుత్వం. అదేంటి తెలుగు మీడియంలో చదివిన కలెక్టర్లు, న్యాయమూర్తులున్నారుగ బావ. ఉన్నారు కాని బావ, తక్కువ. అంతెందుకు తెలుగులో చదివి, ఉద్యోగానికి వెళ్లి జాయినింగు రిపోర్టు ఇంగ్లీషులో యివ్వలేని పరిస్థితి ఉంది బావ. అదీకాక ఉద్యోగాలన్నీ మన తెలుగు రాష్ట్రాల్లోనె రావుగ. నిజమే బావ దాదాపు 300 ఏళ్లు పాలించిన ఆంగ్లేయులు మనకు అంటగట్టిన ఇంగ్లీషు ఇప్పటికీ మరువలేం. కార్టూన్లు తెలుగులో అడిగేవారు లేరు. అదేకాదు బావ, 75 ఏళ్లు గడిచినా కొన్ని పదాలకు ఇప్పటికీ తెలుగు తెలియదు. నిజమే నేనూ రచయిత ఆర్.వి.ఆర్ కలిసి 1961 లో మద్రాసువెళ్లి కొడవటిగంటిని కలిశాం. అప్పుడాయన ఇంటరు ఫిజిక్సును తెలుగులో మార్చేపనిలో ఉండి, మనవాళ్లు తెలుగుమీడియంలో ఇంటరు అనే మాటను తెలుగులో తర్జుమా చేయమని నాకు అప్పజెప్పారు కానీ, కొన్నింటికి తెలుగుపదాలు దొరకడంలేదన్నారు. కాని బావ ప్రాథమిక విద్యలో ఇంగ్లీషు ప్రవేశపెట్టి జగన్ తీవ్ర విమర్శల పాలయ్యారు. నిజమే బావ, అలా విమర్శచేసేవారి పిల్లలు మాత్రం ఇంగ్లీషు మీడియంలో పైగా కార్పొరేట్ స్కూళ్లలో చదవడం వలన వారి మాటలు ఎక్కువమంది పట్టించుకోలేదు బావ. కాని మన పిల్లలు రోజుకు ఆరు గంటలు కూర్చునే స్కూళ్ల పరిస్థితి ఎవరూ పట్టించుకోని స్థితిలో వాటికి పెయింట్లు వేసి మరమ్మతులు టాయిలెట్ల నిర్మాణం చేసి జగన్ మంచిపేరే తెచ్చుకున్నాడు బావ. ఏది ఏమైనా ఈ మధ్య జరిగిన ప్రపంచ తెలుగు సభలవల్ల తెలుగు ప్రేమికులు ముఖ్యంగా తెలుగు రచయితలు ఆ రెండు రోజులు పండుగలా జరుపుకున్నారు బావ. నిజమే నా మటుకు నేను ఆనందంగానే ఫీలయ్యాను. చూశావా బావ సంతోషపడ్డాను అనే కంటే ఫీలయ్యాను అన్నావు. తప్పదు బావ వందల సంవత్సరాలుగ వాడుతున్న పదాలు ఒక్క సారిగా పోవుకదా.

సీనియరు జర్నలిస్టు, సెల్: 9885569394

హంగ్ దిశగా కర్ణాటక

కర్ణాటకలో వచ్చే ఏప్రిల్/మే నెలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోటీ జరగనుందని పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ నిర్వహించిన మొదటి ట్రాకర్ పోల్ సర్వేలో వెల్లడైంది. 'సౌత్ ఫస్ట్' న్యూస్ వెబ్‌సైట్ కోసం పీపుల్స్‌పల్స్ సంస్థ-'సిస్రో' తో కలిసి తాజాగా ఈ సర్వే నిర్వహించింది. రాష్ట్రంలోని మొత్తం 224 స్థానాల్లో, మెజారిటీ రాకపోయినా... కాంగ్రెస్ అత్యధిక స్థానాలు సాధిస్తుందని, హంగ్ ఏర్పడే అవకాశాలున్నాయని ట్రాకర్ పోల్‌లో వెల్లడైంది. పీపుల్స్ పల్స్ డైరెక్టర్ ఆర్ దిలీప్‌రెడ్డి గురువారం మొదటి ట్రాకర్‌పోల్ ఫలితాలను విడుదల చేశారు. మొదటి ట్రాకర్‌పోల్ 2022 డిసెంబర్22 నుంచి 31వరకు నిర్వహించారు. పదిరోజులపాటు జరిగిన తాజా సర్వే గణాంకాలను శాస్త్రీయంగా విశ్లేషించి, సిస్రో వ్యవస్థాపక డైరెక్టర్ ధనుంజయ్ జోషి ఆధ్వర్యంలో నివేదికను రూపొందించారు. ఎన్నికలలోపు మరో రెండు విడతల్లో రాష్ట్రంలో ఈ సర్వే జరుగనుంది. మరో రెండుమార్లు ట్రాక్‌పోల్స్ సర్వేను 2023 మార్చిలో ఒకసారి, సరిగ్గా ఎన్నికలముందు మరోసారి చేపడతారు.

కర్ణాటకలో గత మూడున్నర దశబ్దాలుగా అధికారంలో ఉన్న ఏ పార్టీ కూడా తిరిగి విజయం సాధించలేదు. దక్షిణ భారతదేశంలో కర్ణాటక రాష్ట్రంలో మాత్రమే ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ, ఇక్కడ అధికారం నిలుపుకోవడానికి తీవ్రంగా కృషి చేస్తోంది. 2022 లో ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో వరుసగా రెండోసారి తామే అధికారంలోకి వచ్చినట్టు ఇక్కడ కూడా పట్టుసాధించి, తిరిగి అధికారం నిలుపుకోవడానికి బీజేపీ ప్రయత్నిస్తోంది. మరోవైపు, హిమాచల్‌ప్రదేశ్‌లో అధికార మార్పు సంప్రదాయం కొనసాగినట్లే ఇక్కడకూడా అధికార పార్టీ పరాజయంపాలై తాము అధికారంలోకి వస్తామని కాంగ్రెస్, జేడీ(ఎస్) పార్టీలు ధీమాతో ఉన్నాయి. మొదటి ట్రాకర్ పోల్ సర్వే ప్రకారం, 224 అసెంబ్లీ స్థానాల్లో 101 స్థానాలు (ప్లస్/మైనస్ 9 స్థానాలు) సాధించి కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించనుంది. అధికార బీజేపీ 91 స్థానాలకు (ప్లస్/మైనస్ 7 స్థానాలు) పరిమితమవుతుందని, జేడి(ఎస్) 29 (ప్లస్/మైనస్ 5స్థానాలు), ఇతరులు మూడు స్థానాలు సాధించవచ్చని ట్రాకర్‌పోల్‌లో తేలింది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 113 స్థానాల మెజార్టీ సంఖ్యను ఏ పార్టీ సాధించలేకపోతోంది. 2018 ఎన్నికల తర్వాత రెండు పార్టీల కూటమి ప్రభుత్వం మరోసారి ఏర్పడే అవకాశాలున్నాయి. రాబోయే ప్రభుత్వ ఏర్పాటులో తాము కీలకంగా మారనున్నామని జేడి(ఎస్) ఇప్పటికే చెబుతూ వస్తోంది. వాస్తవిక ఫలితాలు ట్రాకర్‌పోల్ సర్వే అంచనాల ప్రకారంగా, అదే నిజమై జేడీ(ఎస్) కీలకం కానుంది. ట్రాకర్‌పోల్ సర్వే గణాంకాల ప్రకారం కాంగ్రెస్ 2018 ఎన్నికలతో పోలిస్తే రెండు శాతం ఓట్లను పెంచుకొని 22 స్థానాలను అధికంగా సాధిస్తుందని తేలింది. 2018 లో 38శాతం ఓట్లు సాధించిన కాంగ్రెస్ ఈసారి 40 శాతం సాధిస్తుందని రహస్య బ్యాలెట్ ద్వారా నిర్వహించిన ట్రాకర్‌పోల్ సర్వేలో తేలింది. అదే సమయంలో బీజేపీకి 2018 ఎన్నికలతో పోలిస్తే 0.2 శాతం ఓట్లు తగ్గే ఆస్కారం కనిపిస్తోంది. 2018 లో 36.2శాతం ఓట్లు సాధించిన ఆ పార్టీ ఇప్పుడు 36శాతం ఓట్లు సాధిస్తుంది. ఈ స్వల్ప వ్యత్యాసంతో ఆ పార్టీ 13 స్థానాలు కోల్పోనుంది. పీపుల్స్ పల్స్-సిస్రో

రీసెర్చ్ సంస్థల సర్వే ప్రకారం, జేడీ(ఎస్) ఈ ఎన్నికల్లో కిందటి ఎన్నికల కన్నా తక్కువ ఓటు షేరుతో, తక్కువ సంఖ్యలో సీట్లు సాధిస్తూ కూడా ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారనుంది. ఈ పార్టీ 16శాతం ఓట్లు సాధించనుంది. 2018 ఎన్నికలతో పోలిస్తే 2.4 శాతం తక్కువ సాధించి 29 సీట్లు (కిందటిసారి వారి సంఖ్య 37) పొందుతుంది. జేడి(ఎస్) దృష్ట్యా చూస్తే ఆ పార్టీ ఒంటరిగా బరిలోకి దిగినా దాదాపు తన ఓటు బ్యాంకును నిలుపుకోవడం ఎంతో కీలకం. రాష్ట్ర రాజకీయాల్లో కీలకపాత్ర పోషించాలంటే తన ఓటు బ్యాంకును జెడీఎస్ నిలుపుకోవడంతోపాటు అధిక సీట్లను సాధించాలి. కర్ణాటక ఎన్నికల్లో కులాలతో పాటు మత అంశాలు కూడా కీలకంగా మారనున్నాయని ట్రాకర్‌పోల్ సర్వేలో తేలింది. ఓబీసీలు, మాదిగలు, హోలియాలు, దళితులు, ఆదివాసీలు, ముస్లింలు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిస్తున్నారు. మరోవైపు అగ్రకులాలు, వొక్కలింగాలు, లింగాయత్‌లు బీజేపీ వెంట ఉన్నట్లు ట్రాకర్‌పోల్ సర్వేలో తేలింది. జేడీ(ఎస్) ప్రధాన ఓటు బ్యాంకు అయిన వొక్క లింగాలలో 50 శాతం మంది ఈ పార్టీకి మద్దతుగా ఉన్నారు.

అహింసా కూటమి, వొక్క లింగాయతేతరులైన ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు, ముస్లింలు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవడంతో ఆ పార్టీ కొంతమేర ఆధిపత్యం పొందుతుందని ట్రాకర్‌పోల్‌లో తేలింది. 2013-2018 కాంగ్రెస్‌పార్టీ కర్ణాటకలో అధికారంలో ఉన్నప్పుడు, ముఖ్యమంత్రి సిద్దరామయ్య కాలంలో, ఆయావర్గాల సంక్షేమ పథకాల ప్యాకేజీలను అందజేయడం, సమర్థంగా అమలు పరచడంతో కాంగ్రెస్‌కు పార్టీకి వీరినుండి ఎక్కువ మద్దతు లభిస్తోంది. పీపుల్స్‌పల్స్-సిస్రో రీసెర్చ్ సంస్థలు నిర్వహించిన ట్రాకర్‌పోల్ సర్వేలో, కాబోయే ముఖ్యమంత్రి ఎవరన్న ప్రశ్నకు సిద్దరామయ్యకు 28 శాతం మద్దతిచ్చారు. ప్రస్తుత ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మైకు 19శాతం, కుమారస్వామికి 18శాతం మద్దతు లభించింది. హంగ్ అసెంబ్లీ ఏర్పడితే ఏయే పార్టీలు కూటమిగా ఏర్పడాలన్న నిర్దిష్ట ప్రశ్నకు, కాంగ్రెస్, జేడి(ఎస్) కూటమి ప్రభుత్వం ఏర్పడాలని 41శాతం బీజేపీ, జేడి(ఎస్) కూటమి ప్రభుత్వం ఏర్పడాలని 38శాతం మంది అభిప్రాయపడ్డారు. అవినీతి, ఉద్యోగ నియామకాలలో కుంభకోణాలు, నిరుద్యోగం, పెరిగిన ధరలు, ద్రవ్యోల్బణం అంశాలు బీజేపీకి అడ్డంకులుగా ఉన్నాయని ఈ ట్రాకర్‌పోల్ సర్వేలో తేలింది. రైతులలో 40 శాతం, నిరుద్యోగులలో 41 శాతం కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా ఉన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కాంగ్రెస్‌కు 8 శాతం ఆధిపత్యం లభిస్తుండగా, బీజేపీకి పట్టణ ప్రాంతాల్లో కేవలం ఒక శాతం మాత్రమే ఆధిక్యం కనిపిస్తుంది.

కర్ణాటక అభివృద్ధికి ఏ పార్టీ పాలన మెరుగైనదని ప్రశ్నించగా 38 శాతం కాంగ్రెస్, 36 శాతం బీజేపీ, 18 శాతం జేడి(ఎస్)కి అనుకూలంగా ఓటర్లు స్పందించారు. రాబోయే ఎన్నికల్లో కర్ణాటకలో ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని అడిగినపుడు, 38శాతం మంది కాంగ్రెస్ అని, 37శాతం మంది బీజేపీ అని తెలిపారు. బీజేపీకి మరో మారు అవకాశమిస్తారా అని ప్రశ్నించగా 51 శాతం మంది లేదని, 41శాతం అవునని తెలిపారు.

సర్వే చేపట్టిన విధానం..

"సౌత్ ఫస్ట్" న్యూస్ వెబ్‌సైట్ కోసం పీపుల్స్ పల్స్-సిస్రో రీసెర్చ్ సంస్థలు ఈ సర్వేను 56 అసెంబ్లీ స్థానాల్లో 224 పోలింగ్ బూత్‌లను ఎంపిక చేసుకొని మొత్తం 4584 శాంపిల్స్(ఓటర్ల) నుంచి సమాచారం సేకరించాము. జనాభా దామాషాను పరిగణనలోకి తీసుకొని, సామాజిక వర్గాల ఆధారంగా రాండమ్ పద్ధతి ద్వారా ఈ సర్వే జరిగింది. 22 డిసెంబరు నుంచి 31 డిసెంబర్ 2022 వరకు ఈ ట్రాకర్‌పోల్ సర్వే ప్రక్రియ సాగింది. ప్రతి పోలింగ్ స్టేషన్ నుంచి 35 మంది ఓటర్ల నుండి సమాచారం సేకరించారు. ఈ సర్వేలో సీఏపిఐ (కంప్యూటర్ అసిస్టెడ్ ఇంటర్ పర్సనల్ ఇంటర్వ్యూయింగ్) పద్ధతిన డేటా సేకరణ జరిపి, ఓటర్లను ముఖాముఖి కలుసుకుని, ఈ సర్వేలో అవసరమైన ప్రశ్నలు వేస్తూ డమ్మీ ఈవిఎమ్ ద్వారా రహస్య ఓటింగ్ నిర్వహించారు. ఈ సర్వే ఫలితాల్లో 1.2(o/-) వ్యత్యాసాలకు ఆస్కారం ఉంది.

ఆర్.దిలీప్‌రెడ్డి, పీపుల్స్‌పల్స్ సంస్థ డైరెక్టర్

పంట వ్యర్థాలకు చెక్ పెడదాం

తదుపరి పంటలు పండించే నిమిత్తం, ముఖ్యంగా పంజాబ్, ఢిల్లీ చుట్టుపక్కల ఉన్న రైతులు వరి, గోధుమ పంటలు కోసిన అనంతరం మిగిలిన కొయ్య కాళ్ళు, పొట్టలు, వ్యర్థాలను తరచూ అంటించడం(కాల్చడం) ద్వారా ఆ చుట్టుపక్క ప్రాంతాల ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. కాల్చడం వల్ల ఏర్పడే గాలి కాలుష్యం వల్ల ప్రతి సంవత్సరం అక్టోబర్, నవంబర్ నెలల్లో గాలి నాణ్యత ప్రమాదకరంగా ఉంటుంది. మన

దేశంలో వరి, గోధుమ పంటలు పండించే ప్రాంతాల్లో ఎక్కువగా ఈ సమస్యలు ఉంటున్నాయి. రాజధాని ఢిల్లీలో ప్రజలు మరింతగా ఈ సమస్యలకు గురవుతున్నారు. ప్రజలు శ్వాసకోశ, చర్మ సంబంధిత వ్యాధులు, కళ్ళు మంటలు వంటి అనారోగ్యాలకు గురవుతున్నారు. వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరిగి, భూతాపం పెరుగుతోంది. హిమాలయ పర్వతాల మంచుఫలకాలు కరిగిపోతున్నాయి, తద్వారా భూసారం క్షీణిస్తుంది. భూసారాన్ని పెంచే బ్యాక్టీరియా, ఫంగస్ కూడా ఈ కాల్చడం వల్ల కనుమరుగు అవుతున్నాయి. దట్టమైన పొగ మంచు ఏర్పడి అనేక ఆరోగ్య సమస్యలు, రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు, ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలి.

ఈ స్టబ్బుల్ బర్నింగ్ ద్వారా సంభవించే సమస్యలకు ప్రభుత్వాలు కొన్ని నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మానవశ్రమ ద్వారా ఈ వ్యర్థాలను తొలగించాలంటే ప్రతి ఎకరాకు సగటున 6000/7000 రూపాయలు ఖర్చు అయ్యే పరిస్థితి. పేద,సన్నకారు రైతులకు తట్టుకునే శక్తి లేదు. ముఖ్యంగా ప్రభుత్వాలు నూతన సాగుసాధనాలు, యాంత్రీకరణ అందివ్వాలి. వీటిలో హేపీ సీడర్, రోటోవేటర్, బాలెర్, ప్యాడీ స్ట్రా చోపర్ వంటి ఖరీదైన వ్యవసాయ సాధనాలు రైతులకు అందించాలి. లేదా సబ్సిడీ ఇవ్వాలి. తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడి ఇచ్చే విత్తనాలు "పుసా బాస్మతి 1509", "పి.ఆర్ 126" విత్తనాలు వాడాలి. భారత వ్యవసాయ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ తయారు చేసిన "పుసా బయోడి కంపోజర్" వాడి కేవలం 15-20 రోజుల వ్యవధిలోనే ఈ పంట వ్యర్థాలు భూమిలో కలిసే విధంగా చూడాలి. బయోప్లాంట్స్ వాడాలి. సస్టయినబుల్ ఫామ్ మేనేజ్‌మెంట్ పనులు అమలు చేయాలి. ముఖ్యంగా రైతులు పంటలు పండించడమే కాదు, వ్యర్థాలను ఒక శాస్త్రీయ పద్ధతిలో తొలగించే బాధ్యత చేపట్టాలి. రైతుల్లో అవగాహన కల్పించాలి.

ఈ విధంగా ప్రభుత్వాలు ఈ వ్యర్థాలను సక్రమంగా తొలగించడంలో రైతులకు అవగాహన కల్పించడంతోపాటు ఆర్థిక సహకారం అందించాలి. మీడియా కూడా చైతన్యం కల్పించాలి. ఎన్నో ఏళ్లుగా దేశరాజధాని ఢిల్లీ చుట్టుప్రక్కల ప్రాంతాల ప్రజల సమస్యలకు, వాయు కాలుష్యాన్ని పెంచే పంట వ్యర్థాలను తగలబెట్టే కార్యక్రమానికి పూర్తి స్థాయిలో ముగింపు పలకాల్సిన అవసరం ఎంతైనాఉంది. దీనికి రైతులు కూడా సహకరించాలి.

ఐ. ప్రసాదరావు, 6305682733

హక్కుల రక్షణలో మనది అధమస్థాయి

ప్రపంచదేశాల చట్టబద్ధమైన పాలనపై విశ్లేషణను ప్రతి ఏటా విడుదల చేస్తున్నట్టుగా స్వచ్ఛంద సంస్థ 'ప్రపంచ న్యాయపాలన ప్రాజెక్టు'(డబ్ల్యుజెపీ) తాజాగా విడుదల చేసింది. చట్టబద్ధ పాలన సూచీలో వివరాల ప్రకారం, ప్రథమస్థానంలో డెన్మార్క్ ఉండగా, భారత్ 77వ స్థానంలో ఉంది. మన పొరుగున ఉన్న నేపాల్ మన కంటే మెరుగ్గా 69వ స్థానంలో ఉంది. 140 దేశాల్లో చట్టబద్ధమైన పాలన తీరుల్ని 8 అంశాల (44 ఉప-అంశాలు) ఆధారంగా విశ్లేషించి జాబితా వెలువరించారు. ప్రభుత్వ అధికారాల పరిమితులు, అవినీతి లేకపోవడం, ప్రభుత్వ పారదర్శక పాలన, ప్రాథమిక హక్కులు (ఫండమెంటల్ రైట్స్), శాంతి భద్రతలు, ప్రభుత్వ నిఘా వ్యవస్థల తీరు, పౌరన్యాయం (సివిల్ జస్టిస్), నేరన్యాయం (క్రిమినల్ జస్టిస్) అనే ఎనిమిదిఅంశాలను ఆధారంగా చేసుకొని వివిధ ప్రపంచ దేశాల సూచీలను నిర్ణయించారు. చట్టబద్ధమైన పాలన సూచీ-2022 నిర్ణయించిన 140 దేశాల్లో భారత్‌కు 77వ స్థానం(0.50/1.0) దక్కింది. చట్టబద్ధమైన పాలనను అందిస్తున్న దేశాల జాబితాలో ప్రథమస్థానం డెన్మార్క్ (స్కోర్ 0.90/1.0) దక్కించుకోగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నార్వే(0.89/1.0), ఫిన్‌లాండ్(0.87/1.0) దక్కించుకున్నాయి. జాబితా తరువాత 10 వరకు స్థానాల్లో స్వీడన్(0.86/1.0), నెదర్లాండ్స్(0.83/1.0), జర్మనీ(0.83/1.0), న్యూజిలాండ్ (0.83/1.0), లక్జెంబర్గ్(0.83/1.0), ఎస్టోనియా(0.82/1.0), ఐర్లాండ్(0.81/1.0) ఉన్నాయి. చట్టబద్ధమైన పాలన సూచీ జాబితా చివరలో 140వ స్థానంలో వెనిజులా(0.26/1.0) కాగా కంబోడియా(0.31/1.0), అఫ్ఘనిస్థాన్(0.33/1.0), కాంగో(0.34/1.0), హైతీ(0.35/1.0), ఈజిప్టు(0.35/1.0), కామెరూన్(0.36/1.0), నికారాగువా(0.36/1.0), మియన్మార్ (0.36/1.0)లు చట్టబద్ధ పాలనలో పతనస్థితిలో ఉన్నాయి. ప్రపంచవ్యాప్త ప్రముఖ దేశాల్లో 13వ స్థానంలో ఆస్ట్రేలియా(0.79/1.0), 15వ స్థానంలో యూకె(0.79/1.0), 26వ స్థానంలో అమెరికా(0.71/1.0)తో పాటు మన ఇరుగు పొరుగు దేశాల్లో 69వ స్థానంలో నేపాల్(0.52/1.0), 127వ స్థానంలో బంగ్లాదేశ్, 129వ స్థానంలో పాకిస్థాన్ ఉన్నాయి.

అవినీతిలో పతనం

1948, ఆగస్టు 29న నియమించిన రాజ్యాంగ రచన కమిటీలో డా.బిఆర్ అంబేద్కర్ అధ్యక్షతన రాజేంద్రప్రసాదు, కృష్ణమాచారి, రాధాకృష్ణన్, కామరాజ్ కె.యం.మున్షీ, మహమ్మద్ సాదుల్లా, కృష్ణస్వామి అయ్యర్, గోపాలస్వామి అయ్యర్, యన్.మాధవ్‌రావు (అనారోగ్య కారణంగా మిట్టర్‌ను నియమించారు) లాంటి 22మంది ప్రముఖ సభ్యులను నియమించారు. 1949, 26 నవంబరున 284మంది రాజ్యాంగ సభ్యుల సంతకాలతో ఆమోదించిన భారతరాజ్యాంగం జనవరి 26,1950 నుంచి అమలులోకి వచ్చింది. భారత రాజ్యాంగంలోని 22 భాగాల్లో 395 ఆర్టికల్స్, 8 షెడ్యూల్స్ పొందుపరిచారు. గత ఏడున్నర దశాబ్దాలుగా మన రాజ్యాంగం 100 సార్లు సవరణలకు లోనుకాగా నేడు 448 ఆర్టికిల్స్ ఉన్నాయి. వరల్డ్ జస్టిస్ ప్రాజెక్ట్ రూపొందించిన 140దేశాల చట్టబద్ధపాలన సూచీ జాబితాలో భారత్ 0.50/1.0 స్కోరుతో 77వ స్థానంలో నిలిచింది. దక్షిణాసియాదేశాల్లోని 6దేశాల్లో భారత్‌కు 3వ స్థానం దక్కింది. భారత్‌కు సంబంధించిన వివరాల్లో ప్రభుత్వ అధికార పరిమితుల్లో(స్కోర్ 0.58/1.0తో) 52/140 స్థానం, అవినీతి లేమిలో (0.40/1.0 స్కోరుతో) 93/140 స్థానం, పారదర్శక పాలనలో (0.59/1.0 స్కోరుతో) 43/140 స్థానం, ప్రాథమిక హక్కుల్లో (0.47/1.0 స్కోరుతో) 94/140 స్థానం, శాంతి భద్రతల్లో (0.64/1.0 స్కోరుతో) 105/140 స్థానం, నిఘా వ్యవస్థల పనితీరులో(0.47/1.0 స్కోరుతో) 88/140 స్థానం, సివిల్ జస్టిస్‌లో (0.43/1.0 స్కోరుతో) 111/140 స్థానం, క్రిమినల్ జస్టిస్‌లో(0.39/1.0 స్కోరుతో) 89/140 స్థానం పొందింది. అవినీతి, హక్కుల పరి రక్షణ, శాంతి భద్రతలు, నిఘా వ్యవస్థల పనితీరు, సివిల్ జస్టిస్, క్రిమినల్ జస్టిస్ విభాగాల్లో భారత్ పతనస్థాయిలో ఉందని సూచీ పేర్కొంది. చట్టబద్ధ పాలన సూచీ ప్రకారం 2021లో భారత్ 79/139 స్థానం, 2020లో 69/128 స్థానం, 2019లో 68/126 స్థానంలో ఉంది. భారత్‌లో అవినీతి, లంచగొండితనం, ఆశ్రిత పక్షపాతం, ప్రజాధనం దుర్వినియోగం అధికంగా ఉంది. ప్రభుత్వ వ్యవస్థల్లో నిఘా విభాగాలు నిర్వీర్యం కాగా, పౌరులకు న్యాయం అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి.

దేశానికి ఊపిరిగా నిలుస్తున్న భారతరాజ్యాంగం పరిహాసం పాలవుతోంది. ప్రజాస్వామ్యం పతనం అంచున నిలబడింది. చట్టాలు ధనవంతులు, పాలకులకు చుట్టాలుగా మారాయి. అవినీతి సునామీలో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. పౌరహక్కులు నవ్వుల పాలవుతున్నాయి. నీతి, న్యాయాలు అనాథలై ఆలపిస్తున్నాయి. విలువలు కలిగిన పాలనకు చెదలు పడుతున్నది. రాజ్యాంగస్ఫూర్తి పలుచబడుతున్నది. దేశభక్తులు కరువవుతున్నారు. జాతి హితవరులు బలహీనులుగా పరిగణించబడుతున్నారు. శాంతి, భద్రతలు గాల్లో దీపాలైనాయి. అవినీతి నిరోధకశాఖ అవినీతిలో కూరుకుపోయింది. కంచే చేను మేస్తున్నది. రక్షకులే భక్షకులు అవుతున్నారు. అవినీతి మబ్బులను తొలగించే నాథుడే కరువైనాడు. ఇప్పటికైనా ప్రజాస్వామ్య విలువలకు పట్టంకట్టి, రాజ్యాంగస్ఫూర్తిని ఆవహించుకుందాం, స్వర్ణభారతిని నిర్మించుకుందాం.

డా. బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037

'ఎన్టీపీసీ' ఆపేయండి

హైడ్రో ప్రాజెక్టులతోనే ఇళ్లకు పగుళ్లు
తక్షణమే పునరావాసం కల్పించండి
జోషిమఠ్ ప్రజల ఆందోళన- బంద్
డిమాండ్ల పరిష్కారం జరిగే వరకు పోరు

గోపేశ్వర్: ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్ పట్టణంలో ఆందోళనలు మిన్నంటాయి. పట్టణంలోని ఇళ్లకు పగుళ్లు రావడంతో అవి ఏ క్షణంలోనైనా నేలమట్టమయ్యే ప్రమాదకం పరిస్థితి నెలకొన్నది. ప్రజలంతా భయాందోళనకు గురవుతూ అక్కడ నుంచి తరలిపోవాల్సి వస్తోంది. దీంతో వారంతా ఆందోళనబాట పట్టారు. గురువారం బంద్-చక్కాజామ్ నిర్వహించారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు పోరాడతామంటూ ధర్నా చేపట్టారు. ఎన్టీపీసీ ప్రాజెక్టుల వల్లే తమకు ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అయితే ఇళ్లు కూలిపోయే పరిస్థితి ఉండటంతో అక్కడి ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఎన్టీపీసీ ప్రాజెక్టులను తక్షణమే ఆపేయాలని జోషిమఠ్ ప్రజలు ఆందోళనబాట పట్టారు. స్థానికుల వెతలను పట్టించుకోకుండా అధికార యంత్రాంగం వివక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రోడ్లపైకొచ్చి 'పనిచేయని దద్దమ్మ యంత్రాంగం' అని నినాదాలు చేశారు. చక్కాజామ్, వాణిజ్య సముదాయాల బంద్ జరిగినట్లు జోషిమఠ్ బచావో సంఘర్ష్ సమితి కన్వీనర్ అతుల్‌సతీ వెల్లడించారు. ఎస్‌డీఎం ధర్నాస్థలికి వెళ్లి నచ్చజెప్పే ప్రయత్నం చేయగా తమ డిమాండ్ల పరిష్కారానికి నిర్ణయాత్మక కార్యాచరణ ఉంటే తప్ప ఆందోళనను విరమించబోమని నిరసనకారులు స్పష్టంచేశారు. 'స్థానికులకు వెంటనే పునరావాసం కల్పించాలి, ఎన్టీపీసీ సొరంగం, బద్రినాథ్ కోసం హెలాంగ్, మార్వడి మధ్య బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని నిలిపివేయాలి, ఎన్టీపీసీ తపోవన్-విష్ణుగడ్ జలవిద్యుత్ ప్రాజెక్టు నష్టాల భర్తీకి బాధ్యత తీసుకోవాలి' అన్నవి ప్రధాన డిమాండ్లుగా వెల్లడించారు.

కాగా, ఉత్తరాఖండ్ చమోలీ జిల్లాలో ఆరువేల అడుగుల ఎత్తులో ఉన్న జోషిమఠ్ పట్టణం భూకంపాలకు అత్యంత ప్రమాకర 'జోన్-వి'లో ఉంది. బద్రీనాథ్, హేమాకుడ్ సాహిబ్ మార్గంలో ఉంటుంది. పట్టణంలో 30కుపైగా కుటుంబాలు ఉన్నాయి. కొన్ని రోజులుగా భూమి కంపిస్తూ ఇళ్లకు పగుళ్ల ఏర్పడ్డాయి. అధికారులు తరలింపు చర్యలు చేపట్టారు. పట్టణంలో 561 ఇళ్లకు పగుళ్లొచ్చాయని, వీటిలో 153 ఇళ్లు రవిగ్రామ్‌లో ఉండగా గాంధీనగర్‌లో 127, మనోహర్‌బాగ్‌లో 71, సింగ్‌ధార్‌లో 52, పర్సారీలో 50, ఊపర్ బజార్‌లో 29, సునీల్‌లో 27, మర్వాడిలో 28, లోవర్ బజార్‌లో 24 చొప్పున ఉన్నట్లు విపత్తు నివారణ విభాగం జిల్లా అధికారి ఎన్‌కే జోషి తెలిపారు.

29 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు చెప్పారు. నగర్‌పాలికా భవన్ (ప్రాథమిక పాఠశాల), మిలన్ కేంద్ర, జోషిమఠ్ గురుద్వారాలో బాధితులకు తాత్కాలిక పునరావాసం కల్పించినట్లు తెలిపారు. కొందరు తమ బంధువుల వద్ద ఆశ్రయం పొందినట్లు వెల్లడించారు. జోషిమఠ్ పరిణామాలను ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని అధికారులు చెప్పారు. 'జోన్-వి' పరిధి ప్రాంతాలపై నిపుణుల బృందంతో సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు.

'వందేభారత్'పై రాళ్ల దాడి జరిగింది బీహార్‌లో...
బెంగాల్‌లో కాదు: మమత

సాగర్ ఐలాండ్ (పశ్చిమ బెంగాల్): వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ల దాడి జరిగింది పొరుగున్న ఉన్న బీహార్‌లో రాష్ట్రంలోసనీ, తమ రాష్ట్రంలో కాదని గురువారం పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. తప్పుడు వార్తలు ప్రసారం చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చిన మీడియా చానళ్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. 'వందేభారత్‌లో ప్రత్యేకత ఏమీ లేదు. అది ఒక పాతరైలు మాత్రమే, దానికి కొత్త ఇంజిన్ అమర్చారు' అని ఆమె పేర్కొన్నారు. జనవరం 8 నుంచి ప్రారంభం కానున్న గంగాసాగర్ మేళా ఏర్పాట్లను పరిశీలించే నిమిత్తం రెండు రోజుల క్రితం ఆమె సాగర్ ఐలాండ్ వచ్చారు. హౌరా-జల్పాగురి మధ్య తిరిగే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌పై మంగళవారం రెండోసారి రాళ్లదాడి జరిగింది. కొన్ని రోజుల క్రితమే ప్రధాని మోదీ ఈ రైలును ప్రారంభించారు. దీనిపై రైల్వే అధికారులు మాట్లాడుతూ రైలుపై రాళ్లదాడికి పాల్పడిన వారిని గుర్తించినట్టు గురువారం తెలిపారు. ఈ ఘటన తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధాన్ని పురికొల్పింది.

నిందితులను ఉరి తీయాలి: బాధితురాలి కుటుంబ సభ్యుల డిమాండ్

న్యూఢిల్లీ: ప్రమాదానికి గురైన అనంతరం మృతదేహాన్ని కారుతో సహా నాలుగు కిలోమీటర్లు లాక్కెళ్లిన నిందితులను ఉరితీయాలని బాధితురాలి కుటుంబ సభ్యులు, ఇరుగు, పొరుగు వారు డిమాండ్ చేశారు. గురువారం వారంతా సుల్తాన్‌పురి పోలీసుస్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నిందితులకు వ్యతిరేకంగా వారంతా బిగ్గరగా నినాదాలు చేశారు. ఐదుగురిని తక్షణమే ఉరి తీయాలని కోరారు. 'ఇది ప్రమాదం కాదు. కావాలని చేసిన పనే. హత్య చేసినట్టుగా ఈ ఘటన ఉంది' అని ఆందోళనకారుల్లో ఒకరు తెలిపారు. పోలీసులు తక్షణమే సెక్షన్ 302 ప్రకారం ఈ ఘటనను హత్యకేసుగా నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీ నేతగా మాట్లాడుతున్న గవర్నరు

డీఎంకే నేత బాలు విమర్శ

చెన్నై: ద్రవిడుల పాలనకు సంబంధించి తమిళనాడు గవర్నరు ఆర్ఎన్ రవి చేసిన వ్యాఖ్యలపై పాలక డీఎంకే తీవ్రంగా స్పందించింది. రాష్ట్రంలో గందరగోళం, అల్లర్లు సృష్టించే లక్ష్యంతోనే గవర్నరు ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడింది. తమిళనాడులో 50 ఏళ్ల ద్రవిడల పాలనపై గవర్నరు తీవ్ర విమర్శలు చేసినట్లు ఓ వర్గం మీడియాలో వచ్చిన వార్తలను డీఎంకే సీనియర్ నాయకుడు, ఎంపీ టీఆర్ బాలు ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు బీజేపీ రాష్ట్ర కార్యాలయం కమలాలయం నుంచి వచ్చినవేనని, రాజ్‌భవన్ నుంచి కాదని విమర్శించారు. గవర్నరు రవి అసలు సిసలు బీజేపీ కార్యకర్తలా మాట్లాడుతున్నారని బాలు మండిపడ్డారు. సామ్రాజ్యవాదంతో పాటు సనాతన, ఆర్యులు, ద్రవిడులు వంటి అంశాలను గవర్నరు తరచూ ప్రస్తావించడం అత్యంత ప్రమాదకరం, బాధాకరమని బాలు స్పష్టంచేశారు. వర్గ, వర్ణ రాజకీయాల గురించి పదేపదే మాట్లాడటం ద్వారా వర్ణాశ్రమ రోజులు తిరిగి తీసుకురావాలని గవర్నరు కోరుకుంటున్నట్లు ఉందని బాలు విమర్శించారు. రవి వ్యాఖ్యలన్నీ మతాలు, కులాలకు సంబంధించినవిగానే ఉన్నాయని, అసలు సిసలు రాజకీయ నేతగా ఆయన బహిరంగంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రజలలో చీలిక, గందరగోళం సృష్టించడానికి గవర్నరు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధ పదవిలో కొనసాగుతున్న గవర్నరు రాజకీయ వ్యాఖ్యలు, కుల-మత అంశాలు ప్రస్తావించడం సరికాదని హితవు పలికారు. గవర్నరు వ్యాఖ్యలు రాజ్యాంగాన్ని ఉల్లంఘించేలా ఉన్నాయన్నారు. ద్రవిడుల పాలనపై గవర్నరు వ్యాఖ్యలు బీజేపీ ఎన్నికల రాజకీయాలను ప్రతిబింబిస్తున్నాయని విమర్శించారు. జీడీపీ, ద్రవ్యోల్బణం సహా అనేక అంశాలలో తమిళనాడు మిగిలిన రాష్ట్రాల కన్నా ఉత్తమంగా ఉందని బాలు చెప్పారు. ఉత్తరప్రదేశ్, బీహార్ వృద్ధిరేటు గురించి రవికి తెలిసినట్లు లేదని వ్యాఖ్యానించారు.

భారత్ జోడో యాత్ర ఓ ఉద్యమం

- విభజన సిద్ధాంతంపై అలుపెరగని పోరాటం
- జైరాం రమేశ్ స్పష్టీకరణ

షామ్లీ(యూపీ): బీజేపీ-ఆర్ఎస్ఎస్ విభజన సిద్ధాంతంపై పోరాటానికి భారత్ జోడో యాత్ర ఓ ఆయుధంగా పనిచేస్తోందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పష్టంచేశారు. భారత్ జోడో యాత్ర ఓ కార్యక్రమం కాదని, ఉద్యమమని, దీనిని కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పిస్తూ...సామాజిక అసమానతలు, విభజన, రాజకీయ నియంతృత్వం అనే మూడు సవాళ్లను దేశం ఎదుర్కొంటున్నదని జైరాం రమేశ్ అన్నారు. మన ప్రధాని ఉద్దేశం, విధానాలు వీటినే ప్రతిబింబిస్తున్నాయని విమర్శించారు. యూపీలోని షామ్లీ జిల్లాలో రాహుల్ పాదయాత్ర గురువారం సాగింది. భారత్ చీలిపోదని, అలాంటప్పుడు భారత్ జోడో యాత్ర అవసరమేముందని బీజేపీ నాయకులు అంటున్నారని, మన ముందు మూడు ప్రధాన సవాళ్లు ఉన్నాయని తాను చెబుతున్నానని రమేశ్ అన్నారు. దేశంలో సామాజిక అసమానతలు పెరుగుతున్నాయని, కులాలు-మతాల వారీ విభజన జరుగుతోందని, దీనికితోడు రాజకీయ నియంతృత్వం పెచ్చరిల్లిందని ఆయన ఆరోపించారు. జైరాం రమేశ్ గురువారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారత్ జోడో యాత్ర లక్ష్యాలు వివరించారు. విభజన సిద్ధాంతానికి వ్యతిరేకంగా పోరాడటమే భారత్ జోడో యాత్ర ఉద్దేశమన్నారు. భారత్ జోడో యాత్ర మన్‌కీ బాత్‌కీ యాత్ర కాదని మోదీ చేసిన వ్యాఖ్యలపై రమేశ్ స్పందిస్తూ...కేవలం ప్రసంగాలు చేయడం రాహుల్ యాత్ర లక్ష్యం కాదన్నారు. రైతులు, దళితులు, ఆదివాసీలు, మహిళలు, మాజీ సైనికులు సహా అనేక వర్గాల ప్రజలతో కలిసి నడుస్తూ...వారి సాధకబాధకాలు వినడమేనని చెప్పారు. దేశంలో రెండు సిద్ధాంతాల మధ్య యుద్ధం జరుగుతోందని, అందులో ఒకటి బీజేపీ, ఆర్ఎస్ఎస్ చేస్తుండగా మరోవైపు కాంగ్రెస్ పోరాడుతోందని రమేశ్ వివరించారు. రాహుల్ యాత్రకు అపూర్వ స్పందన లభిస్తోందని, ఆర్ఎల్‌డీ, ఎస్పీ వంటి అనేక పార్టీల కార్యకర్తలు సంఘీభావం తెలుపుతున్నారన్నారు.

సోనూసూద్‌కు రైల్వే అధికారుల హెచ్చరిక



న్యూఢిల్లీ: బాలీవుడ్ స్టార్ నటుడు, రియల్ హీరో సోనూసూద్‌కు రైల్వే అధికారులు హెచ్చరికలు చేశారు. ఇటీవల ట్విట్టర్‌లోఆయన పోస్టు చేసిన ఓ వీడియోను రైల్వే అధికారులు తీవ్రంగా పరిగణించారు. అందులో కదులుతున్న రైల్లో సోనూసూద్ ఫుట్ బోర్డుపై అజాగ్రత్తగా ప్రయాణిస్తూ కనిపించారు. హ్యాండ్‌రైల్ పట్టుకుని రైలు తలుపు అంచున తన కాలి వేళ్లపై కూర్చొని.. రైలు నుంచి బయటకు చూస్తూ కనిపించారు. దీనిపై అప్పట్లో నెటిజన్లు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ వీడియోపై రైల్వే అధికారులు తాజాగా స్పందిస్తూ, సోనూసూద్‌ని సున్నితంగా హెచ్చరించారు. రైల్లో ఇలా ప్రయాణించడం చాలా ప్రమాదకరమని ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు. 'డియర్ సోనూ సూద్. మీరు ఎంతో మందికి రోల్ మోడల్. ఇలా రైలు మెట్లపై ప్రయాణించడం చాలా ప్రమాదకరం. ఇలాంటి వీడియోలతో మీ అభిమానులకు తప్పుడు సందేశం పంపినట్లవుతుంది. మరోసారి ఇలాంటివి చేయకండి. రైలు ద్వారా సున్నితమైన, సురక్షితమైన ప్రయాణాన్ని ఆస్వాదించండి' అంటూ పోస్టు చేసింది.

2017 కేసులో దోషిగా యూపీ మంత్రి

బరేలీ (ఉత్తరప్రదేశ్): బీజేపీ అభ్యర్థిని హత్యచేయాలనే ఉద్దేశంతోనే 2017లో జరిగిన దాడి కేసులో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంలోని మాజీ మంత్రి సహా 10 మంది నిందితులను స్థానిక కోర్టు దోషులుగా నిర్ధారించింది. మాజీ మంత్రి భగవత్ శరణ్ గంగ్వార్ సహా తొమ్మిది మంది నిందితులు పరారీలో ఉన్నట్లు కోర్టు ప్రకటించింది. దోషిగా తేలిన ఇతర నిందితులు కూడా బెయిల్‌పై బయట ఉన్నారు. 2017 ఫిబ్రవరిలో బీజేపీ అభ్యర్థి కేసర్ సింగ్ గంగ్వార్, అతని సహచరులను హత్య చేయాలనే ఉద్దేశంతో భగవత్ సరన్ గంగ్వార్‌తో సహా పది మంది ఈ దాడికి పాల్పడ్డారు. కేసర్ సింగ్ గంగ్వార్ జిల్లాలోని నవాబ్‌గంజ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఔచిత్య ద్వివేది గురువారం తెలిపారు. సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు భగవత్ శరణ్ గంగ్వార్, మరో ఎనిమిది మంది నిందితులపై నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీ చేసినప్పటికీ బరేలీలోని ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టుకు హాజరు కాలేదని ద్వివేది తెలిపారు. కోర్టు ఆదేశం చినప్పటికీ పోలీసులు అతనిని, ఇతర నిందితులను కూడా అరెస్టు చేయలేకపోయారు. ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు జడ్జి దేవాశిష్ బుధవారం భగవత్ శరణ్ గంగ్వార్, ఇతర నిందితులను దోషులుగా నిర్ధారించి, వారు పరారీలో ఉన్నట్లు ప్రకటించారు. తదుపరి విచారణ జనవరి 11న. 2021లో అప్పటి బీజేపీ ఎమ్మెల్యే కేసర్ సింగ్ గంగ్వార్ మరణించిన తర్వాత పోలీసులు తుది నివేదికను సమర్పించారని, ఆ నివేదికను కోర్టు తిరస్కరించిందని ద్వివేది చెప్పారు.

తమిళనాడులో 6.20 కోట్లమంది ఓటర్లు

చెన్నై: ఫొటో ఎలక్టోరల్ రోల్ 2023 ప్రత్యేక సారాంశ సవరణ, సమగ్ర తుది ఓటర్ల జాబితా ప్రకారం తమిళనాడులో మొత్తంగా 6,20,41,179మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 3,04,89,866 మంది పురుషులు, 3,15,43,286 మంది మహిళలు ఉండగా, 8,027 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. ఈ జాబితా గురువారం చెన్నైలో విడుదలైంది. జనవరి 4 నాటికి, ఎలక్టర్స్ ఫొటో ఐడెంటిటీ కార్డ్ (ఈపీఐసీ)తో లింక్ చేయడానికి సుమారు 3.82 కోట్ల ఆధార్ నంబర్లు సేకరించగా, ఇది 61.60 శాతం అని తమిళనాడు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సత్యబ్రత సాహూ తెలిపారు. ఈ రోల్ జనవరి 1, 2023 అర్హత తేదీగా గురువారం ప్రచురించబడింది. నవంబర్ 9, 2022న ముసాయిదా ప్రచురణతో రివిజన్ ప్రారంభమైంది. డిసెంబర్ 8, 2022 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించబడ్డాయి. రివిజన్ వ్యవధిలో పేర్లను చేర్చడానికి 10,54,566 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 10,17,141 దరఖాస్తులు ఆమోదించబడి, నమోదయ్యాయి. అలాగే తొలగించాలని కోరుతూ 8,43,007 దరఖాస్తులు రాగా వాటిలో 8,02,136 ఎత్తివేతలు, చావు, నకిలీ ఎంట్రీల కారణంగా జరిగాయి. 2,15,308 మంది ఓటర్లకు సంబంధించి ఎంట్రీలు సరి చేయబడ్డాయి. చెంగల్‌పట్టు జిల్లాలోని షోజింగనల్లూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 6,66,295 మంది ఓటర్లతో ప్రథమస్థానంలోఉంది. ఇందులో 3,34,081 మంది పురుషులు, 3,32,096 మంది మహిళలు, 118 మంది థర్డ్ జెండర్ ఉన్నారు. కోయంబత్తూరు జిల్లాలోని కవుందంపళయం అసెంబ్లీ నియోజకవర్గం 2,27,835 మంది పురుషులు, 2,29,454 మంది మహిళలు, 119 మంది థర్డ్ జెండర్‌లతో సహా 4,57,408 మంది ఓటర్లతో తరువాతి స్థానంలో ఉంది.

నాగపట్నం జిల్లాలోని కిల్వేలూర్ నియోజకవర్గం అత్యల్ప సంఖ్యలో 1,75,128 మంది ఓటర్లను కలిగి ఉంది, ఇందులో 85,652 మంది పురుషులు, 89,474 మంది మహిళలు, ఇద్దరు థర్డ్ జెండర్లు ఉన్నారు, చెన్నై జిల్లాలోని హార్బర్ నియోజకవర్గం 1,70,125 మంది ఓటర్లతో 88,396 మంది పురుషులు, 81,6970 మంది స్త్రీలు, 81,6970 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. దాదాపు 3,310 మంది విదేశీ ఓటర్లు కూడా ఫైనల్ రోల్‌లో చోటు దక్కించుకున్నారు. ఇప్పటివరకు, 4,48,138 మంది వికలాంగుల (పీడబ్ల్యూడీ) ఓటర్లు ఓటర్ల జాబితాలో చేర్చ చేయబడ్డారు. 18-19 సంవత్సరాల వయసు గల 4,66,374 మంది ఓటర్లు నమోదు చేయబడ్డారు. ఇందులో 2,52,048 మంది పురుషులు, 2,14,171 మంది మహిళలు, 155 మంది థర్డ్ జెండర్ ఉన్నారు.

భారత్‌కు వచ్చిన ఆ ప్రయాణీకుల్లో 11 వేరియంట్లు

10 రోజుల్లో 19వేలకు పైగా పరీక్షలు
124 మందికి పాజిటివ్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ప్రయాణికులకు నిర్వహిస్తున్న కరోనా పరీక్షల్లో వివిధ రకాల వేరియంట్లు వెలుగులోకి వస్తున్నాయి. భారత్‌కు వచ్చిన అంతర్జాతీయ ప్రయాణికుల్లో 11 రకాల కరోనా వైరస్ వేరియంట్లు బయటపడ్డట్లు అధికార వర్గాలు తెలిపాయి. గత 10 రోజులలో భారత్‌కు వచ్చిన సుమారు 124 మంది అంతర్జాతీయ ప్రయాణికులకు స్క్రీనింగ్ చేసిన తర్వాత కోవిడ్ పాజిటివ్‌గా తేలిందని అధికారులు తెలిపారు. డిసెంబర్ 23- జనవరి 3 మధ్య ఇతర దేశాల నుంచి భారతదేశానికి వచ్చిన 19, 227 మంది ప్రయాణీకులను విమానాశ్రయాలు, ఓడరేవులు, ల్యాండ్ పోర్ట్‌ల్లో పరీక్షించగా, వారిలో 124 మందికి పాజిటివ్‌గా తేలినట్లు పేర్కొన్నారు. కాగా ఈ ప్రయాణీకులకు 11 రకాల వేరియంట్లు సోకినట్లు పరీక్షల్లో తేలింది. 124 పాజిటివ్ శాంపిల్స్‌లో 40 జీనోమ్ సీక్వెన్సింగ్ ఫలితాలు వచ్చాయని, అందులో 14 శాంపిల్స్‌లో ఎక్స్‌బీబీ, ఎక్స్‌బీబీ.1, బీఎఫ్ 7.4.1 ఒక శాంపిల్‌లో ఉన్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. కాగా ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను పాటించాలని కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవియా కోరారు.

కొన్ని దేశాల్లో కరోనా కేసులు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో గత నెలలో భారత ప్రభుత్వం విమాన ప్రయాణీకుల కోసం సవరించిన మార్గదర్శకాలను జారీ చేసింది. కొత్త వేరియంట్లను గుర్తించడానికి విమానాశ్రయాల్లో పరీక్షల్ని ప్రవేశపెట్టింది. అంతేకాకుండా, చైనా, హాంకాంగ్, జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్, థాయ్‌లాండ్ నుంచి వచ్చే ప్రయాణికులు తప్పనిసరిగా కోవిడ్ నెగెటివ్‌గా ధృవీకరణ పత్రాలను అందించాల్సి ఉంటుంది. మాస్క్‌లు ధరించడం, భౌతిక దూరం పాటించడం వంటి కోవిడ్ నిబంధనల అమలుపై దృష్టి కేంద్రీకరించింది. గత నెలలో దేశ వ్యాప్తంగా ఆసుపత్రులు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలలో మాక్ డ్రిల్ నిర్వ హించారు. కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవియా కోవిడ్ సంసిద్ధతను సమీక్షించడానికి దేశ రాజధానిలోని సఫ్దర్ జంగ్ ఆసుపత్రిని సందర్శిం చారు. దేశంలోని కోవిడ్ పరిస్థితిని అలాగే ఆరోగ్య మౌలిక సదుపాయాల సంసిద్ధతను అంచనా వేయడానికి ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన డిసెంబర్ 22 న ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రస్తుతానికి భారత్‌లో కరోనా కేసులు తక్కువ సంఖ్యలో నమోదవుతున్నాయి. చాలా రోజులుగా ప్రతిరోజూ 200 కంటే తక్కువగా కొత్త కేసులుంటున్నాయి.

లంచాన్ని హక్కుగా భావిస్తున్నారు

బొమ్మై ప్రభుత్వంపై కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడి విమర్శ

బెంగళూరు: కర్ణాటక రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తుమకూరు కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు బలరామయ్య తీవ్ర ఆరోపణలు చేశారు. రాజకీయ నేతల నుంచి గుమస్తా వరకూ అందరూ లంచాన్ని తీసుకోవడాన్ని హక్కుగా భావిస్తున్నారని, ప్రతి శాఖలోనూ అవినీతి పెచ్చరిల్లిందని విమర్శించారు. కమీషన్ ఇస్తేనే బిల్లులు మంజూరు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీ శాసనసభ్యుల నియోజక వర్గాలకు మాత్రమే ఏటా 10-15 కోట్ల నిధుల్ని విడుదల చేస్తున్నారని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలకు చిల్లిగవ్వ ఇవ్వడం లేదని విమర్శించారు. లంచాలు ఇచ్చిన వారికే కాంట్రాక్టులు, నిధులు ఇస్తున్నారని విమర్శించారు. టెండరు ప్రక్రియలో పారదర్శకత కరువైందన్నారు. గుత్తేదార్ల సమస్యల పరిషారానికి, బిల్లుల మంజూరుకు రాజకీయ నేతలు, అధికారులు 40 శాతం కమీషన్ తీసుకుంటున్నారని ఆరోపించిన కర్ణాటక గుత్తేదార్ల సంఘం అధ్యక్షుడు కెంపణ్ణను అరెస్టు చేసినందుకు నిరసనగా ఈ నెల 10న బెంగళూరులోని స్వాతంత్ర్య ఉద్యానవనంలో ఆందోళన చేపడుతున్నామని తెలిపారు.

23 నుంచి కేరళ అసెంబ్లీ

తిరువనంతపురం: కేరళ అసెంబ్లీ సమావేశాలు జనవరి 23 నుంచి ప్రారంభం కానున్నాయి. 23 నుంచి అసెంబ్లీని సమావేశ పర్చాలని గవర్నరు ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌కు సిఫార్సు చేయాలని ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధ్యక్షతన గురువారం జరిగిన ప్రత్యేక కేబినెట్ సమావేశం నిర్ణయించింది. ఈ మేరకు సీఎంఓ ఓ ప్రకటనలో తెలిపింది. గవర్నరు ప్రసంగం ముసాయిదా తయారీకి మంత్రుల సబ్‌కమిటీని ఏర్పాటు చేశారు. ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ఈ సమావేశాల్లోనే బడ్జెట్ ప్రవేశపెడుతుంది.

హిమాచల్ స్పీకర్‌గా కుల్దీప్‌సింగ్ పథానియా

ధర్మశాల: హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన కాంగ్రెస్ నాయకుడు కుల్దీప్ సింగ్ పథానియా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పథానియా చంబా జిల్లాల్లోని భతియ్యత్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఏకైక స్పీకర్ అభ్యర్థిగా నిలిచారు. ప్రొటెం స్పీకర్ చందర్ కుమార్ సభ ముందు పథానియా పేరు ప్రతిపాదించగా, ఏకగ్రీవంగా ఆయనను ఎన్నుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుకు, ప్రతిపక్ష నాయకుడు జైరామ్ ఠాకూర్ పథానియాను అభినందించి, స్పీకర్ కుర్చీవద్దకు తోడ్కొని వెళ్లారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని చాంబా జిల్లా నుంచి స్పీకర్‌గా ఎన్నికైన నాలుగో వ్యక్తిగా పథానియా నిలిచారు. అంతకుముందు జైవంత్ రామ్, దేశ్ రాజ్ మహాజన్, తులసిరామ్ స్పీకర్‌లుగా పనిచేశారు. సెప్టెంబరు 17, 1957న జన్మించారు. సైన్స్, న్యాయశాస్త్రంలో డిగ్రీ పొందిన పథానియా, మొట్టమొదటిసారిగా 27 ఏళ్ల వయసులో 1985న అసెంబ్లీకి ఎన్నికయ్యారు. అనంతరం 1993, 2003, 2007, 2022లో గెలిచారు. 1993, 2003లో ఆయన స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేశారు. సభ్యులు సరైన సమయం, సహకారం అందిస్తే రాష్ట్రానికి చెందిన సమస్యలపై చర్చించే అవకాశం ఉంటుందని పథానియా ప్రమాణస్వీకారం అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా 23మంది కొత్తగా ఎన్నికైనా ఎమ్మెల్యేలను ఆయన అభినందించారు. ప్రతిపక్ష నాయకులు ఠాకూర్ ఆరుసార్లు వరుసగా గెలుపొందారని, డిప్యూటీ సీఎం ముకేశ్ అగ్నిహోత్రి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని, కొత్తసభ్యులందరూ వారిని చూసి ఎంతో నేర్చుకోవాల్సి ఉంటుందని ఆయన సూచించారు. న్యాయ శాస్త్ర నిపుణుడిగా పథానియా నుంచి నేర్చుకోవాల్సి ఎంతోఉందని సీఎం సుకు సభను ఉద్దేశించి మాట్లాడుతున్న సందర్భంగా పేర్కొన్నారు. కొత్తగా ఎన్నికైన స్పీకర్ సభలో నియమ, నిబంధనలు అమలు చేస్తారని, సభలో మాట్లాడేందుకు ప్రతి ఒక్క సభ్యుడికి అవకాశం ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

కేరళ మంత్రి చెరియన్‌కు ఊరట

న్యూఢిల్లీ: రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలకు సంబంధించి కేరళ మంత్రి సాజి చెరియన్‌పై కేసు నమోదైంది. దీనిపై విచారణ జరిపిన పోలీసులు ఆయనకు క్లీన్‌చిట్ ఇచ్చారు. అయితే, చెరియన్‌కు క్లీన్ చిట్ ఇస్తూ పోలీసులు దాఖలు చేసిన నివేదికపై ఓ న్యాయవాది కోర్టును ఆశ్రయించారు. పోలీసు నివేదికపై తుది తీర్పును వాయిదా వేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను కేరళ కోర్టు గురువారం కొట్టివేసింది. ఈ విషయంపై సీబీఐ విచారణ కోరుతూ తాను కేరళ హైకోర్టుకు వెళ్లానని, అప్పటి వరకు తుది తీర్పును వాయిదా వేయాలని న్యాయవాది బైజూ నోయల్ ఎం కోరారు. న్యాయవాది అభ్యర్థనను తిరువల్లలోని జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు తోసిపుచ్చింది. తన అభ్యర్థనను కోర్టు తిరస్కరించినట్లు ఆ న్యాయవాది స్వయంగా ప్రకటించారు. ఈ కేసులో పోలీసులు నిష్పక్షపాత దర్యాప్తు జరపలేదని నోయల్ వాదించారు. చెరియన్ బుధవారం రాజ్‌భవన్‌లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనను తిరిగి కేబినెట్‌లోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ యూడీఎఫ్ ఎమ్మెల్యేలు కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యాఖ్యల ఆరోపణలపై చెరియన్‌కు పోలీసులు క్లీన్‌చిట్ ఇవ్వడంతో ఆయనను తిరిగి కేబినెట్‌లోకి తీసుకోవాలని సీపీఎం నిర్ణయించింది.

చలి గుప్పెట్లో దేశ రాజధాని

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో చలిపులి వణికిస్తోంది. బుధవారం ఉదయం కనిష్ఠ ఉష్ణోగ్రతలు 4.4 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. రోజు మొత్తంలో అతి తక్కువగా 3.3 డిగ్రీల ఉష్ణోగ్రతను ఢిల్లీ రిడ్జ్ వాతావరణ కేంద్రం నమోదు చేసింది. ఈ సీజన్‌లో ఇదే అత్యల్పం కావడం గమనార్హం. దీంతో ధర్మశాల(5.2 డిగ్రీలు), నైనితాల్(6 డిగ్రీలు), డెహ్రాడూన్(4.5 డిగ్రీలు) లాంటి ప్రాంతాల కన్నా తీవ్రంగా ఢిల్లీలో శీతల వాతావరణం నెలకొంది. దట్టమైన పొగమంచు వల్ల 200 మీటర్ల కన్నా దూరంలోని వాహనాలు కనిపించడం లేదు. దీనివల్ల రోడ్డు, రైలు మార్గాల్లో రాకపోకలపై ప్రభావం పడుతోంది. ఢిల్లీకి వెళ్లే సుమారు 19 రైళ్లు గంటన్నర నుంచి నాలుగున్నర గంటల మేర ఆలస్యంగా నడిచినట్లు రైల్వే అధికారి ఒకరు తెలిపారు. సింధు-గంగ పరీవాహక ప్రాంతాల మైదానాలతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆవరించిన దట్టమైన పొగమంచుకు సంబంధించిన ఉపగ్రహ చిత్రాలను భారత వాతావరణ విభాగం(ఐఎండీ) విడుదల చేసింది. దేశ రాజధానిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా పడిపోయాయని, చాలా చోట్ల 13 నుంచి 15 డిగ్రీల మధ్య నమోదు కావొచ్చని ఐఎండీ శాస్త్రవేత్త ఒకరు తెలిపారు. మరో 24 గంటల నుంచి 48 గంటల వరకూ ఇలాంటి పరిస్థితులే ఉండొచ్చని పేర్కొన్నారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో రెండు రోజుల వరకూ ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. పంజాబ్, హరియాణా, రాజస్తాన్, ఉత్తర్‌ప్రదేశ్, బీహార్ సహా ఉత్తర భారతంలో శీతల వాతావరణం అధికంగా ఉండబోతోందని తెలిపారు. యూపీ, పంజాబ్, హరియాణాల్లో రెడ్ అలర్ట్ జారీ చేశారు.

రాజస్తాన్‌లోనూ ఇదే పరిస్థితి

జైపూర్: రాజస్తాన్‌లో చలి వణికిస్తోంది. ని చురులో కనిష్ఠ ఉష్ణోగ్రత మైనస్ 0.9గా నమోదైంది. బుధవారం ఫతేపూర్ (శిఖర్)లో -1.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, చురులో 1.5గా నమోదైనట్టు వాతావరణశాఖ పేర్కొంది. రాష్ట్రంలో మిగితా ప్రాంతాల్లోని ఉష్ణోగ్రతలు కూడా పడిపోయాయని తెలిపింది. చిత్తోర్‌ఘర్‌లో -0.1 డిగ్రీలు, కరౌలీలో 1.2, అల్వార్‌లో 1.3, భిల్వారాలో 1.4, పిలానీ, సిరోహిలో 2 డిగ్రీలు, బికనీర్‌లో 2.4 డిగ్రీలు, బందీలో 3.4 డిగ్రీలు, జైపూర్‌శ్రీన్‌లో 3.8 డిగ్రీలు, అజ్మీర్‌లో 3.9 డిగ్రీలు, కోటలో 4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం ఉదయం దట్టంగా పొగమంచు కమ్ముకుని ఉంది. మరో రెండురోజుల పాటు చలిగాలులు వీస్తాయని వాతావరణశాఖ అధికారి ఒకరు తెలిపారు.

జగన్‌కు ఓటమి భయం

- అందుకే మాపై తప్పుడు కేసులు
- నన్ను అడ్డుకోవడానికే జీఓ నం.1
- పెద్దిరెడ్డీ...నీ సంగతి తేలుస్తా
- క్షీణించిన శాంతిభద్రతలు
- చంద్రబాబు విమర్శలు

విశాలాంధ్ర-కుప్పం: జగన్ ప్రభుత్వ అరాచకాలు పరాకాష్ఠకు చేరాయని, ముఖ్యమంత్రి జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే తమపై తప్పుడు కేసులు పెడుతున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. టీడీపీకి లభిస్తున్న ఆదరణ చూసి భరించలేకపోతున్నారన్నారు. కొంతమంది పోలీసులు స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రజలతో పాటు పోలీసులు కలిసి రావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. చంద్రబాబు గురువారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ జగన్ సర్కారును తూర్పారబట్టారు. గతంలో పాదయాత్రలను ఏ ప్రభుత్వం అడ్డుకోలేదని, తాను సీఎంగా ఉన్నప్పుడు సైతం ఎవరి పాదయాత్ర ఆపలేదని చంద్రబాబు చెప్పారు. జగన్ ప్రభుత్వం జీవో నెంబర్ ఒకటి తీసుకొచ్చి తనపైనే ప్రయోగిస్తోందని మండిపడ్డారు. తన సొంత నియోజకవర్గంలో పర్యటించడానికి ప్రభుత్వ అనుమతి తీసుకోవాలా అని ప్రశ్నించారు. తన ప్రచార వాహనం ఇస్తారా లేక పోరాటం చేయమంటారా అని పోలీసులపై మండిపడ్డారు. చట్టాలను ఎవరు అతిక్రమించినా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి అరాచకశక్తిగా మారి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. తాను సీఎంగా ఉన్నప్పుడు వైఎస్, షర్మిల, జగన్ పాదయాత్రలు చేశారని, వారికి తాను భద్రత కల్పించానని గుర్తు చేశారు. తమపైనే దాడులు చేసి...తమపైనే కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై చంద్రబాబు మండిపడ్డారు. పెద్దిరెడ్డీ... తమాషా చేస్తున్నావా? నీ సంగతేమిటో తేలుస్తా..ఎవరు ఎవరిని రెచ్చగొడుతున్నారు? తీరు మార్చుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ప్రజలంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తాను తలచుకుంటే పెద్దిరెడ్డి జిల్లాలో తిరిగేవాడా అని అన్నారు. ఏపీలో అత్యవసర పరిస్థితి ఉందన్నారు. జగన్ విఫల ముఖ్యమంత్రన్నారు. సైకో పాలన పోవాలి, సైకిల్ పాలన రావాలని పిలుపునిచ్చారు. జగన్ వింతచేష్టలతో కుప్పంలో శాంతిభద్రతలు గాడితప్పాయన్నారు. మొదటి రోజు పర్యటనలో పోలీసులపై దాడి చేశారని, విధులకు ఆటంకాలు కలిగించారని, దూషించారని ఆరోపిస్తూ పదిమంది టీడీపీ నేతలు, కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. 121 పెద్దూరులో డీఎస్పీ సుధాకర్‌రెడ్డిని దూషించారని, గొల్లపల్లి వద్ద సీఐ విధులకు ఆటంకాలు కలిగించారని, పోలీసులపై దాడి చేశారని, శాంతిపురం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పోలీసులకు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు మధ్య జరిగిన ఘర్షణ కారణంగా కేసులు నమోదు చేశారు. ఇవన్నీ తప్పుడు కేసులని చంద్రబాబు మండిపడ్డారు. తనపై ప్రయోగించడానికే జీవో నెం1 తీసుకువచ్చారన్నారు. ఇది ఉన్మాదుల రాజ్యం, సైకోల రాజ్యమన్నారు.

8న గ్రూప్-1 స్క్రీనింగ్ టెస్ట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-1 స్క్రీనింగ్ టెస్ట్‌ను ఈ నెల 8వ తేదీన నిర్వహిస్తారు. ఈ మేరకు ఏపీపీఎస్సీ కార్యదర్శి హెచ్.అరుణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ... రెండు సెషన్లుగా పరీక్షలు జరుగుతాయి. ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ (28ఉ2022) ఆధారంగా ఈ స్క్రీనింగ్ టెస్ట్‌కు షెడ్యూలు జారీజేశారు. 8వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. అభ్యర్థులు...ఉదయం సెషన్‌లో పరీక్షా కేంద్రానికి 9.45 గంటలకు, మధ్యాహ్నం సెషనకు 1.45 గంటలకు చేరుకోవాలి. నిర్ణీత సమయం ముగిశాక అభ్యర్థులను ఎవ్వర్నీ అనుమతించ బోరు. పరీక్షకు హాజరైన వారంతా ఏదైనా హాల్ టిక్కెట్లతోపాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆధార్, డ్రైవింగ్, పాన్ తదితర ఫోటో కార్డులతో హాజరు కావాలి.

మహిళా సైన్యాధికారులు పెరగాలి: ముర్ము

న్యూఢిల్లీ: రక్షణ రంగంలో మహిళా ప్రాతినిధ్యం పెరగాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మిలటరీ ఇంజినీరింగ్ సేవల్లో (ఎంఈఎస్) మహిళాధికారులు పెరగాలని పిలుపునిచ్చారు. గురువారం రాష్ట్రపతి భవన్‌కు వచ్చిన ఎంఈఎస్ ఆఫీసర్ ట్రైనీలనుద్దేశించి మాట్లాడుతూ నిర్మాణ రంగంలో యువ అధికారులుగా పర్యావరణ సంరక్షణ కూడా మీ ప్రాథమిక బాధ్యతే అని నొక్కిచెప్పారు. సుస్థిరాభివృద్ధి కోసం పునరుత్పాదక ఇంధనం వినియోగం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేవలను మరింత సమర్థంగా అందించేందుకు సమాచార-ప్రసారాల సాంకేతికత వినియోగించాలని అన్నారు. 'దేశం కోసం పౌరుల కోసం తమ ప్రాణాలను త్యజించేందుకు మన సైనికులు అన్నివేళలా సిద్ధంగా ఉంటారు. మాతృభూమి వీరపుత్రులు-పుత్రికలకు సేవ చేస్తున్నందుకు మీరు గర్వపడాలి' అని ట్రైనీలతో ముర్ము అన్నారు. కార్యక్రమంలో ఎంఈఎస్ ఇంజినీర్, ఆర్కిటెక్ట్, సర్వేయర్ కేడర్ పాల్గొన్నారు.

8 నుంచి గీతా ముఖర్జీ శతజయంత్యుత్సవం

దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుదాం: సీపీఐ పిలుపు

న్యూఢిల్లీ: కమ్యూనిస్టు విప్లవయోధురాలు గీతా ముఖర్జీ శతజయంత్యువాన్ని ఈనెల 8వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని పార్టీశ్రేణులకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనను సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా వెలువరించారు. 'ఆమెను గీతాదీ అని అంతా పిలిచేవారు. గీతా ముఖర్జీ 1924, జనవరి 8న కోల్‌కతాలో జన్మించారు. 1942, నవంబరు 8న కామ్రేడ్ విశ్వనాథ్ ముఖర్జీని పెళ్లి చేసుకున్నారు. విశ్వనాథ్ ముఖర్జీ కూడా సీపీఐ నాయకులు, పశ్చిమ బెంగాల్ శాఖ కార్యదర్శి. కలకత్తాలోని అశుతోష్ కాలేజిలో చదువుకునే రోజుల్లోనే కార్యకర్తగా, అఖిలభారత విద్యార్థి సమాఖ్య నాయకులుగా గీతాదీ వ్యవహరించారు. 15ఏళ్ల చిరుప్రాయంలో సీపీఐలో చేరి ఎర్రజెండా చేతపట్టారు. 1946లో పార్టీ రాష్ట్ర సమితికి ఎన్నికయ్యారు. జాతీయ కార్యదర్శివర్గంలో, జాతీయ కార్యవర్గంలో, జాతీయ సమితిలో సభ్యురాలిగా ఉన్నారు. స్వాతంత్ర్య పోరాటమప్పుడు-తర్వాత కూడా జైలుకు వెళ్లారు. భారతీయ జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) మహిళా సాధికారత కోసం ఎనలేని కృషిచేశారు. పార్లమెంటుతో పాటు శాసనసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కోసం పోరాటానికి చిహ్నంగా నిలిచారు. 1967, 1977లో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1980 నుంచి 2000 వరకు ఏడుసార్లు పన్స్‌కురా నియోజవర్గం నుంచి ఎన్నికయ్యారు.సమర్థ పార్లమెంటేరియన్‌గా ప్రజల సమస్యలపై చట్టసభలను గడగడలాడించేవారు. పేదలు, మహిళల సాధికారత కోసం పార్లమెంటు వేదికగా పోరాడారు. 2000, మార్చి4న గీతాదీ మృతిచెందారు. ఆమె మరణం దేశాన్ని విషాదంలో ముంచెత్తింది. వలసవాద పాలన, దోపిడీ రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటాలు సాగించారు. భారతీయ కమ్యూనిస్టు విప్లవయోధురాలు గీతాదీ సీపీఐ గొప్ప నాయకులలో ఒకరు. ఆమె పార్టీకి ఎప్పుడూ గర్వకారణమే' అని డి.రాజా పేర్కొన్నారు. గొప్ప కమ్యూనిస్టుగా నిబద్ధతగల నాయకురాలిగా ప్రజల అభ్యున్నతి, మహిళా సాధికారత కోసం అంకితమైన గీతాదీ శతజయంత్యుత్సవాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుందామని పిలుపునిచ్చారు.

మనోహర్ విమానాశ్రయానికి తొలి విమానం

పనాజీ: అధునాతన సదుపాయాలతో ఉత్తర గోవాలో ఇటీవల ప్రారంభించిన మనోహర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణీకుల రాకపోకలు ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి తొలి ప్రయాణీకుల విమానం ఇక్కడకు చేరుకుంది. 179 మంది ప్రయాణీకులతో కూడిన ఇండిగో విమానం రాజధాని పనాజీకి 35 కిలోమీటర్ల దూరంలో ఉత్తర గోవా జిల్లాలోని మోపా వద్ద ఉన్న కొత్త విమానాశ్రయంలో ఉదయం 9 గంటలకు ల్యాండ్ అయింది. ఈ సందర్భంగా గోవా ప్రభుత్వం తొలి విమాన ప్రయాణీకులకు ఘనంగా స్వాగతం పలికింది. ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ మాట్లాడుతూ... గోవా ప్రజల కల నిజమైంది, రాష్ట్రానికి పెద్ద విజయం అన్నారు. కొత్త విమానాశ్రయంలో అందిస్తున్న సేవలపై ప్రయాణీకులు సంతోషం వ్యక్తం చేశారని ప్రశంసించారు. కేంద్ర మంత్రి శ్రీపాద్ నాయక్, ఉత్తర గోవా రాజ్యసభ సభ్యుడు వినయ్ టెండూల్కర్, సీఎం సావంత్, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోహన్ ఖౌంటే, రవాణా మంత్రి మౌవిన్ గోడిన్హో, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సదానంద్ షెట్ తనవాడే, ఎయిర్‌లైన్స్ అధికారులు టెర్మినల్ భవనం వద్ద ప్రయాణీకులకు స్వాగతం పలికారు. కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి వి.కె. సింగ్ వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పర్యవేక్షణకు సాఫ్ట్‌వేర్

వారంలో సాంకేతిక సమస్యల పరిష్కారం: సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎనిమిదో తరగతి విద్యార్థుల ట్యాబుల వాడకం, పాఠాలు నేర్చుకునే తీరుపై నిరంతర పర్యవేక్షణ కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఉండాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ట్యాబ్‌ల నిర్వహణ కోసం అసెంబ్లీ నియోజకవర్గాలన్నింటిలో కంపెనీ సర్వీసు సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. జగన్ గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పాఠశాల విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. అన్ని పాఠశాలల్లో సబ్జెక్టులవారీగా టీచర్లు ఉండాలని ఆదేశాలిచ్చారు. తద్వారా బోధనా నాణ్యత పెరుగుతుందని, విద్యార్థుల అభ్యాసం మెరుగవుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ పూర్తి అయినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. డేటా అనలిటిక్స్ ద్వారా పర్యవేక్షణకు అనుగుణంగా ఏర్పాట్లను హెడ్‌మాస్టర్, ఎంఈఓలు చేసుకోవాలని సీఎం సూచించారు. ట్యాబ్‌లలో సమస్యలు వస్తే వారంలోగా మరమ్మతులు జరగాలని, అవసరమైతే విద్యార్థులకు కొత్త ట్యాబ్‌లు ఇవ్వాలన్నారు. తరగతిగదుల డిజిటలైజేషన్‌లో భాగంగా ఐఎఫ్‌పీ ప్యానళ్ల ఏర్పాటుపై చర్యల గురించి ఆరా తీశారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ఐఎఫ్‌పీ ప్యానళ్ల ఏర్పాటు పూర్తి కావాలని సీఎం ఆదేశించారు. నాణ్యతపై రాజీపడ్డనీ, డిజిటల్ స్క్రీన్లతో విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందాలన్నారు. డిజిటల్ బోధనా విధానాలపై టీచర్లకు అవగాహన, శిక్షణ కల్పించాలన్నారు. పిల్లల వద్ద నిఘంటువులు ఉన్నాయో లేదో పరిశీలించి... లేనివారికి అందజేయాలని ఆదేశాలిచ్చారు. వచ్చే విద్యా సంవత్సరం... విద్యాకానుక కోసం అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి లబ్ధి జరగాలని సూచించారు. పాఠశాలల్లో సబ్జెక్టులవారీగా టీచర్లు ఉంటేనే నాణ్యమైన బోధన సాధ్యమని చెప్పారు. డీఎస్సీ-98 అభ్యర్థులకు త్వరగా పోస్టింగులు ఇవ్వాలని, 'గోరుముద్ద' నాణ్యతను నిరంతరం పరిశీలించాలని సూచనలు చేశారు. అన్ని స్కూళ్లు, అంగన్‌వాడీలకు సార్టెక్స్ ఫోర్టిఫైడ్ బియ్యం ప్రత్యేక లేబుల్‌తో సరఫరా జరగాలని సూచించారు. అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీలు, గురుకుల పాఠశాలలకు, హాస్టళ్లకు ఈ బియ్యాన్నే సరఫరా చేస్తున్నట్టు అధికారులు తెలుపగా, ఫిబ్రవరి నుంచి వారానికి మూడు రోజులు పిల్లలకు గ్లాసుడు రాగీ మాల్ట్ ఇవ్వాలన్నారు. ఐరన్, క్యాల్షియం లోపాన్ని నివారించడానికి ఇది దోహదమవుతుందన్నారు. నాడు-నేడు రెండోదశ పనులనూ సీఎం సమీక్షించారు. 22 వేలకుపైగా స్కూళ్లలో రూ.1500కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, గృహనిర్మాణ, గ్రామ వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక సీఎస్ అజయ్ జైన్, పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్.గుల్జార్, విద్యాశాఖ సలహాదారు సాంబశివారెడ్డి, ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ ఎంవీ శేషగిరిబాబు, పాఠశాల మౌలికవసతుల కల్పన కమిషనర్ కాటమనేని భాస్కర్, పౌర సరఫరాలశాఖ కమిషనర్ వీరపాండ్యన్, మిడ్డే భోజనం డైరెక్టర్ నిధిమీనా, నాడు-నేడు డైరెక్టర్ (టెక్నికల్) మనోహర్‌రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సిరి, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ (పాఠశాల విద్యాశాఖ) ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజమౌళికి 'న్యూయార్క్ ఫిల్మ్ క్రిటిక్స్ సర్కిల్ అవార్డు'

న్యూయార్క్: ప్రపంచ చలన చిత్ర రంగంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే న్యూయార్క్ ఫిల్మ్ క్రిటిక్స్ సర్కిల్ అవార్డును దర్శకధీరుడు రాజమౌళి అందుకున్నారు. న్యూయార్క్ వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కుటుంబసమేతంగా జక్కన్న పాల్గొని.. 'ఆర్ఆర్ఆర్' చిత్రానికిగానూ ఉత్తమ దర్శకుడిగా ఈ అవార్డును అందుకున్నారు. సినీ ప్రియులు, 'ఆర్ఆర్ఆర్' టీమ్‌కు ధన్యవాదాలు చెప్పారు. తన కుటుంబానికి ఎప్పటికీ రుణపడి ఉంటానని అన్నారు. "ఆర్ఆర్ఆర్' చిత్రానికిగానూ ఉత్తమ దర్శకుడిగా ప్రతిష్ఠాత్మక అవార్డును సొంతం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ వేదికపై అందరి ముందు నిల్చొని మాట్లాడటం కాస్త కంగారుగా అనిపిస్తోంది. నా దృష్టిలో సినిమా అంటే ఓ దేవాలయం. చిన్నప్పుడు థియేటర్‌లో సినిమా చూడటానికి వెళ్లినప్పుడు పొందిన ఆనందం ఇప్పటికీ గుర్తుంది. నేను ఏ సినిమా తీసినా ప్రతి సీన్‌ను చిత్రీకరించే ముందు.. 'ఈ సీన్ థియేటర్‌లో ఎలా ఉంటుంది' అని ఒక ప్రేక్షకుడిగా ఊహించుకుంటా. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులను ఆకట్టుకోవడం కోసం నేను సినిమాలు చేస్తుంటాను. కానీ, 'ఆర్ఆర్ఆర్'కు వచ్చేసరికి భారతీయులు ఎలాంటి ప్రేమను చూపించారో.. అదే అభిమానాన్ని, ఉత్సాహాన్ని విదేశాల్లోనూ చూశా. 'ఆర్ఆర్ఆర్'పై విదేశీయులు సైతం అమితమైన అభిమానం చూపించారు. న్యూయార్క్, చికాగోకు వెళ్లినప్పుడు థియేటర్లలో వాళ్ల ఆనందాన్ని ప్రత్యక్షంగా చూశా. ఇక చిత్రబృందం మొత్తం నా కుటుంబం అంటూ ప్రతి ఒక్కరూ సాధారణంగా చెబుతుంటారు. కానీ, నా విషయంలో అది కాస్త భిన్నం. ఎందుకంటే నా సినిమాల కోసం పనిచేసే ముఖ్యమైన వ్యక్తులందరూ నా సొంత కుటుంబసభ్యులే. నేను తెరకెక్కించే సినిమాలకు నా తండ్రి (విజయేంద్రప్రసాద్) కథ రాస్తుంటారు. పెద్ద అన్నయ్య (కీరవాణి) సంగీత దర్శకుడిగా, నా సతీమణి (రమ) కాస్ట్యూమ్ డిజైనర్‌గా, నా తనయుడు (కార్తికేయ), వదిన (వల్లి) లైన్ ప్రొడ్యూసర్లుగా, సోదరుడి కుమారుడు (కాలభైరవ) గాయకుడిగా, మరో సోదరుడు రచయితగా ఇలా వీళ్లంతా నన్ను ఎప్పుడూ ప్రోత్సహిస్తూనే ఉన్నారు. నన్ను అత్యున్నత స్థానంలో నిలపడం కోసం వారు కష్టపడుతున్నారు. నేను ఎలాంటి విజయాలు అందుకున్నా నా కుటుంబానికి ఎప్పటికీ రుణపడి ఉంటా. అలాగే, 'ఆర్ఆర్ఆర్' టీమ్, నా హీరోలు ఎన్.టి.రామారావు, రామ్‌చరణ్‌కు ధన్యవాదాలు" అని జక్కన్న వివరించారు. ఈ వేడుకలో పాల్గొనేందుకు రాజమౌళి సంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారు. భారతీయత చాటేలా ధోతీ-కుర్తా ధరించారు. ఈ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

సముద్రంలోకి ముగ్గురు ఆక్వానాట్‌లను పంపనున్న భారత్

నాగపూర్: భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సముద్రయాన్ మిషన్‌లో భాగంగా ఈ ఏడాది ముగ్గురు పరిశోధకులను సముద్రం అడుగుకు 500 మీటర్ల లోతుకు పంపనుంది. చెన్నైలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీకి చెందిన ఇంజనీర్లు ఇప్పటికే ఆక్వానాట్ (సముద్ర గర్భంలో పరిశోధనలు చేసే నిపుణులు)ల ప్రయాణానికి వీలుగా టైటానియం ఉక్కు గోళాన్ని రూపొందించినట్లు సంబంధిత అధికారి వెల్లడించారు. అయితే సముద్రంలో 6,000 మీటర్ల లోతుకు పరిశోధకులను పంపే ప్రణాళిక ఆలస్యమయ్యే అవకాశం ఉందని, అంత లోతులో ఒత్తిడిని తట్టుకోగల టైటానియం గోళాన్ని కొనుగోలు చేయడంలో ఇబ్బందులున్నాయని ఇక్కడ జరుగుతున్న ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొన్న ఆ అధికారి పీటీఐకి వెల్లడించారు. టైటానియం ఉక్కు గోళం 500 మీటర్ల లోతు వరకు ఒత్తిడిని తట్టుకోగలదని, అయితే అది లోతుగా ప్రయాణించేకొద్దీ బలహీనమవుతుందని ఆయన అన్నారు.

మహిళల ఐపీఎల్ జట్ల కొనుగోలుకు ఐదు ఫ్రాంచైజీలు

ముంబై: ఈ ఏడాది మార్చిలో నిర్వహించనున్న మహిళల ఐపీఎల్ (డబ్ల్యూఐపీఎల్) కోసం బీసీసీఐ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. తొలుత ఐదు జట్లతో ఈ లీగ్‌ను ప్రారంభించనుంది. దీనికి సంబంధించి ఐదు ఫ్రాంచైజీల నుంచి టెండర్లను ఆహ్వానించింది. మహిళల జట్లను కొనుగోలు చేసేందుకు ఫ్రాంచైజీలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న పది ఫ్రాంచైజీలలో ఐదు.. ఒక్కో టీమ్‌ను కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందులో చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ వంటివి డబ్ల్యూఐపీఎల్‌పై ఆసక్తి చూపాయి. సీఎస్‌కే ఇప్పటికే ఆ దిశగా ఏర్పాట్లు మొదలుపెట్టింది. "బిడ్ పత్రాల కొనుగోలుకు దరఖాస్తు చేసుకున్నాం. ఇందుకు సంబంధించిన లావాదేవీలు జరపాల్సి ఉంది. మహిళల జట్టును సొంతం చేసుకునేందుకు మేం చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. మా ఫ్రాంచైజీలో ఒక్క మహిళా జట్టు కూడా లేకపోతే ఏం బాగుంటుంది. అదే విధంగా మేం మహిళల క్రికెట్ (డబ్ల్యూఐపీఎల్-2023)కు ప్రచారం కల్పించాలనుకుంటున్నాం' అంటూ సీఎస్‌కే సీఈవో కాశీ విశ్వనాథ్ మీడియాకు వెల్లడించాడు. "మేం బిడ్ పత్రాలను అందుకున్నాం" అంటూ రాజస్థాన్ జట్టు ఛైర్మెన్ రంజిత్ భర్తాకుర్ పేర్కొన్నాడు. జట్ల కొనుగోలుకు బీసీసీఐ ఎలాంటి ప్రాథమిక ధరను నిర్ణయంచలేదని సమాచారం. "ఈ లీగ్ విషయంలో బీసీసీఐ ప్రాథమిక ధరను నిర్ణయించకపోవడం చాలా మంచిదైంది. రూ.400 కోట్లు ప్రాథమిక ధర అయితే ఫ్రాంచైజీలు వెనుకాడే అవకాశం ఉంది" అని క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. గతేదాది డిసెంబర్‌లో ముంబై వేదికగా ఆస్ట్రేలియాతో మహిళల టీ20 సిరీస్‌కు అభిమానుల నుంచి భారీ ఆదరణ లభించిన విషయం తెలిసిందే. దాదాపు 47 వేల మంది అభిమానులతో ఈ స్టేడియం కిటకిటలాడింది. ఈ సిరీస్ ఇన్వెస్టర్లకు సైతం మంచి లాభాలను అందించింది. దీంతో మహిళల ఐపీఎల్ జట్ల కొనుగోలుకు ఇన్వెస్టర్లు, ఫ్రాంచైజీలు ముందుకు వస్తున్నాయి. మార్చి మొదటి వారం నుంచి నెలాఖరు వరకు ఈ ఓపెనింగ్ సీజన్‌ను నిర్వహించనున్నారు. వాంఖడే, డీవై పాటిల్ వంటి పెద్ద మైదానాలు ఉన్న కారణంగా లీగ్ మొత్తాన్ని ముంబై వేదికగా నిర్వహించేందుకు బీసీసీఐ యోచిస్తున్నట్టుగా తెలుస్తోంది. దీనిపై అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

టీ20 సిరీస్ నుంచి సంజూ ఔట్

ముంబై: టీమిండియా అభిమానులకు బీసీసీఐ షాకింగ్ వార్త చెప్పింది. శ్రీలంకతో జరుగుతున్న మూడు టీ20ల సిరీస్‌కు కేరళ డ్యాషింగ్ బ్యాటర్ సంజూ శాంసన్ దూరమైనట్లు వెల్లడించింది. వాంఖడే వేదికగా జరిగిన తొలి టీ20లో సంజూ శాంసన్ ఏమాత్రం ఆకట్టుకోలేకపోయాడు. బ్యాటింగ్‌లో వెంట వెంటనే రెండు వికెట్లు పడిన తర్వాత క్రీజులోకి వచ్చిన అతను.. ఇన్నింగ్స్ నిర్మించలేకపోయాడు. ధనంజయ డిసిల్వ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడేందుకు ప్రయత్నించి కేవలం 6 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్దనే పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత ఫీల్డింగ్‌లో కూడా లంక ఓపెనర్ పాథుమ్ నిస్సంక ఇచ్చిన క్యాచ్‌ను జారవిడిచాడు. ఇది చూసిన చాలా మంది సంజూకు అవకాశాలు రావడమే గగనం. అలా వచ్చిన అవకాశాలను ఇలా చేజేతులారా నాశనం చేసుకోవడం ఏంటి? అని అక్కసు వెళ్లగక్కుతున్నారు. ఈ మ్యాచ్‌లో సరిగా ఆడకపోవడంతో రెండో టీ20లో అతన్ని పక్కన పెడతారేమో అని ఫ్యాన్స్ టెన్షన్ పడ్డారు. అలాంటి సమయంలో అతను అసలు మొత్తం టీ20 సిరీస్‌కే దూరమైనట్లు బీసీసీఐ ప్రకటించింది. తొలి టీ20లో సంజూ గాయపడ్డాడని చెప్పిన బీసీసీఐ ఈ షాకింగ్ విషయం తెలియజేసింది. ఈ మ్యాచ్‌లో బౌండరీ లైన్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో సంజూ మోకాలికి గాయమైనట్లు బీసీసీఐ వెల్లడించింది. దీంతో అతనికి వెంటనే స్కాన్స్ తీయించామని, నిపుణులు అతనికి విశ్రాంతి అవసరం అని చెప్పడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని బీసీసీఐ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ వార్త విన్న అభిమానులు షాకైపోయారు. ఇంత పక్షపాతం చూపించడం కరెక్ట్ కాదంటూ బీసీసీఐపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా సంజూ స్థానంలో విదర్భ వికెట్ కీపర్ బ్యాటర్ జితేశ్ శర్మను బీసీసీఐ ఎంపిక చేసింది. అతను ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ తరపున రాణించిన సంగతి తెలిసిందే.

నాగశౌర్య-శివరాజ్‌కుమార్

మల్టీ స్టారర్ చిత్రం?

హైదరాబాద్: నాగ శౌర్య మంచి నటుడు కానీ ఒక మంచి బ్రేక్ కోసం ఎదురు చూస్తున్నాడు. ప్రస్తుతం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి' షూటింగ్ చేస్తున్నాడు. అలాగే ఇంకో రెండు ప్రాజెక్ట్‌తో కూడా బిజీ గా వున్నాడు. ఈమధ్యనే తనకు నచ్చిన అమ్మయిని ప్రేమ వివాహం చేసుకొని ఆనందంగా ఉన్నాడు. ఇప్పుడు పరిశ్రమలో వినిపిస్తున్న టాక్ ఏంటి అంటే, నాగ శౌర్యని ఒక మల్టీ-స్టారర్ చిత్రం కోసం సంప్రదింపులు జరుపుతున్నట్టుగా తెలుస్తోంది. ఈ మల్టీ-స్టారర్‌లో కన్నడ పరిశ్రమకు చెందిన శివ రాజ్‌కుమార్ కూడా ఈ చిత్రంలో నటింపచేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టుగా వార్తలు వచ్చాయి. శివ రాజకుమార్, కన్నడ పరిశ్రమలో పేరున్న కుటుంబం. కన్నడ రాజకుమార్ పెద్ద కుమారుడు. అతని సినిమాలు అప్పుడప్పుడు తెలుగులో డబ్బింగ్ సినిమాలుగా విడుదల అవుతున్నాయి. నాగ శౌర్య ఇప్పుడు శివ రాజకుమార్‌తో చేతులు కలిపి ఈ మల్టీ-స్టారర్ చేస్తే అది పాన్ ఇండియా సినిమాగా రూపాంతరం చెందుతుంది. కన్నడ పరిశ్రమలో రాజ్ కుమార్ కుటుంబానికి మంచి పాపులారిటీ వున్న సంగతి తెలిసిందే. అలాగే నాగ శౌర్య తన నటనతో అందరినీ మెప్పిస్తూ, ఇప్పుడిప్పుడే పెద్ద స్థాయికి ఎదుగుతున్న నటుడు. ఈ సినిమాకి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తాడని టాక్ వినిపిస్తోంది. ఇది ఇంకా చర్చలు దశలోనే ఉందని, త్వరలో దీని మీద ఒక క్లారిటీ వస్తుందని అంటున్నారు.

ఆస్కార్ జాబితాలో ఎన్టీఆర్?

లండన్: 'ఆర్ఆర్ఆర్' ఎంట్రీతో ఈ ఏడాది సినీ ప్రియుల అందరి కళ్లు ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవంపైనే ఉన్నాయి. 'ఉత్తమ నటుడి'గా ఎవరు విజయం సాధిస్తారా? అని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ హాలీవుడ్ మ్యాగజైన్ 'వెరైటీ' ఓ ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఉత్తమ నటుడి జాబితాలో ఎన్టీఆర్ పేరు, ఉత్తమ దర్శకుడిగా రాజమౌళి 'ఆస్కార్'కు నామినేట్ అయ్యే అవకాశం ఉందని ఈ మ్యాగజైన్ జోస్యం చెప్పింది. విల్ స్మిత్, హ్యూ జాక్‌మన్ వంటి హాలీవుడ్ స్టార్స్ పేర్లతో ఉన్న ఈ జాబితాలో ఎన్టీఆర్ చోటు దక్కించుకోవడంపై తారక్ అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్‌కు ఆస్కార్ వచ్చే అవకాశం ఉందని గతంలోనూ ఈ పత్రిక ఓ కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు రాబట్టిన 'ఆర్ఆర్ఆర్'కు అంతటా విశేష ఆదరణ లభించింది. సినీ ప్రియుల నుంచి వస్తోన్న ప్రేమాభిమానాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది జరగనున్న అకాడమీ అవార్డుల్లో పోటీ పడేందుకు జనరల్ కేటగిరీలో 'ఆర్ఆర్ఆర్' టీమ్ దరఖాస్తు చేసుకుంది. ఈ చిత్రం నుంచి నాటునాటు పాట ఆస్కార్ ఉత్తమ ఒరిజనల్ సాంగ్ విభాగం షార్ట్‌లిస్ట్‌లోచోటు దక్కించుకుంది. షార్ట్‌లిస్ట్‌లో ఎంపికైన చిత్రాలకు జనవరి 12 నుంచి 17 వరకూ అకాడమీ బృందం ఓటింగ్ నిర్వహించనుంది. ఆ ఓటింగ్‌ను ఆధారంగా చేసుకుని జనవరి 24న ఆస్కార్ నామినేషన్‌లో నిలిచిన చిత్రాలను ప్రకటిస్తారు. అనంతరం మార్చి 12న విజేతలకు ఆస్కార్ అవార్డులు అందించనున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.